శనివారం
02-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 160
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేవీలో తొలి మహిళా కమాండింగ్ అధికారి

న్యూఢిల్లీ: భారత నౌకాదళం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అన్ని పదవులు - అన్ని ర్యాంకులు అనే నినాదం స్ఫూర్తితో భారత నౌకాదళానికి చెందిన నౌకలో తొలి మహిళా కమాండింగ్ అధికారిని నియమించినట్లు తెలిపింది. ఈ మేరకు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ శుక్రవారం ఒక ప్రకటన చేశారు. 'నేవీలో మహిళా అగ్నివీర్‌ల సంఖ్య వెయ్యి దాటింది. తొలి మహిళా కమాండింగ్ అధికారిని నియమించాం. దేశ భద్రత, ప్రయోజనాల కోసం హిందూ మహాసముద్ర జలాల్లో నావికాదళం నిరంతరం పనిచేస్తుంది. ఎప్పుడు యుద్ధ సన్నద్ధతతో ఉంటుంది. ఇండో-ఫసిఫిక్ ప్రాంతంలో సంతృప్తికర స్థాయిలో నౌకలను మోహరించాం' అని అడ్మిరల్ హరికుమార్ తెలిపారు.

రాష్ట్రాలపై రుణభారం

- ఆదాయానికి మించి వ్యయం
- రూ.87 లక్షల కోట్లకు చేరనున్న అప్పులు
- క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా

ముంబై: ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక మూలధన వ్యయాలు, మితమైన ఆదాయ వృద్ధి మధ్య రాష్ట్రాల రుణాలు వాటి స్థూల దేశీయోత్పత్తిలో 31-32 శాతానికి పెరుగుతాయని, మొత్తం రుణాలు 9 శాతం పెరిగి రూ.87 లక్షల కోట్లను దాటే అవకాశం ఉందని ఒక నివేదిక తెలిపింది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)కి దాని రుణ నిష్పత్తిగా రాష్ట్ర రుణభారాన్ని కొలుస్తారు. కోవిడ్‌కు ముందు, రుణ-జీఎస్‌డీపీ నిష్పత్తి 28-29గా ఉంది. కానీ ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ రేటింగ్స్ నివేదిక ప్రకారం, జీఎస్‌డీపీ నిష్పత్తిగా మొత్తం స్థూల ఆర్థిక లోటు (జీఎఫ్‌డి) 2.5 వద్ద ఉంటుందని అంచనా వేయబడింది. ఇది ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం ప్రకారం తప్పనిసరి స్థాయి 3 కంటే చాలా తక్కువ. ఊహించిన దాని కంటే తక్కువ రాబడి వృద్ధి వల్ల ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు , వడ్డీ వ్యయాల చెల్లింపులు, మూలధన వ్యయాలను విస్తరించేందుకు రాష్ట్రాలు మరిన్ని రుణాలు తీసుకోవలసి వస్తుంది. ఈ పరిణామం సింగిల్ డిజిట్ రాబడి

- మిగతా 2 లో

జల డ్రామా ఫ్లాప్ !

- ఏపీ హడావుడిపై కేఆర్ఎంబీ విస్మయం
- నీటి విడుదల వెంటనే ఆపాలని ఆదేశం
- కేంద్ర హోం శాఖ జోక్యంతో సమసిన వివాదం
- ఇకపై సీఆర్‌పీఎఫ్ ఆధీనంలో సాగర్ డ్యామ్
- నేడు రెండు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్రం సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : నాగార్జున సాగర్ వేదికగా ఏపీ, తెలంగాణా పాలకపక్ష పెద్దలు సృష్టించిన జల డ్రామా అట్టర్‌ఫ్లాప్ అయింది. కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోమారు గద్దె నెక్కించేందుకు ఆఖరి అస్త్రంగా చేసిన ప్రయోగం అభాసుపాలైంది. పోలింగ్ రోజున తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు ఇదే బ్రహ్మాస్త్రంగా భావించి అమలు చేసిన వ్యూహం బెడిసికొట్టింది. దీనిపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రతిపక్షాలన్నీ మూకుమ్మడిగా తిప్పికొట్టడంలో సఫలమయ్యాయి. వాస్తవానికి 2021 జులై 15న కేంద్ర జలశక్తి శాఖ ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు కృష్ణా నది యాజమాన్య బోర్డు పరిధిని నిర్దేశిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. రెండున్నరేళ్లు గడుస్తున్నా దాన్ని ఎందుకు అమలు చేయలేకపోతున్నారని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏనాడూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది లేదు. ప్రధాన మంత్రి మోదీ, పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు బాధ్యత వహిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి షెకావత్‌ను అనేకసార్లు కలిసినా ఏనాడూ ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆంధ్ర ప్రదేశ్ నీటి హక్కులను పరిరక్షించాలని వారిని నిలదీసిన దాఖలాల్లేవు. అలాగే తెలంగాణ నీటి పారుదల శాఖాధికారులు నీటిని విడుదల చేయకపోతే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. శ్రీశైలం జలాశయం నిర్వహణ బాధ్యత ఆంధ్ర ప్రదేశ్‌కు అప్పగించారు. నాగార్జున సాగర్ జలశయాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించారు. ఈ వాస్తవాన్ని పక్కనబెట్టి, సాగర్ డ్యామ్‌లో 13 గేట్లు ఏపీ భూభాగంలో ఉన్నాయన్న వాదన తెరపైకి తెచ్చి ఏపీ ప్రభుత్వం ఆడిన రాజకీయ డ్రామా రక్తికట్టలేదు. తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం ఎడమ వైపు విద్యుదుత్పత్తి కేంద్రం నియంత్రణను వాళ్ల చేతుల్లోనే పెట్టుకుంది. ఈ వంకతో ఆంధ్ర ప్రదేశ్ భూభాగంలో ఉన్న సాగర్ డ్యామ్‌ను స్వాధీనం చేసుకున్నామంటే చట్టం ఒప్పుకుంటుందా? పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డు తన పరిధిలోకి తీసుకొని, నిర్వహించమని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలే తప్ప రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే దుశ్చర్యకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పాల్పడడం తీవ్ర విమర్శలకు గురైంది. అక్టోబరులో 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కేఆర్ఎంబీని ఏపీ ప్రభుత్వం కోరగా, 5.01 టీఎంసీలు విడుదల చేశామని, నవంబరులో ఏపీ ప్రభుత్వం నుంచి నీరు విడుదల చేయాలని ఎలాంటి వినతి తమకు అందలేదని కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి తెలిపారు. నీరు విడుదల చేయమని కోరకుండానే ఏపీ ప్రభుత్వం అకస్మాత్తుగా పోలీసు బలగాల మోహరింపుతో డ్యామ్‌పై హడావుడి చేయడంపై కేఆర్ఎంబీ విస్మయం వ్యక్తం చేసింది.

రాజకీయ డ్రామాలకు పోలీసులు బలి

రెండు రాష్ట్రాల పాలకపక్ష పెద్దలు ఆడిన డ్రామాలకు ఆంధ్ర ప్రదేశ్ పోలీసులు బలయ్యారు. ఏపీ పోలీసులపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయడం సీఎం జగన్ ప్రభుత్వానికి సిగ్గుచేటుగా మారింది. తెలంగాణ ఎన్నికలు జరిగే రోజునే నాగార్జున సాగర్ డ్యామ్ దగ్గర జల వివాద సమస్యను ఉన్న పళంగా తెరపైకి రెండు ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రయత్నించి, పెద్ద ఎత్తున పోలీసు బలగాలను అక్కడి రప్పించి హడావుడి చేశారు. పైకి రాష్ట్రాల హక్కుల కోసం పోరాడుతున్నట్లు సృష్టించారు. ఈ వివాదంలో ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు బాగానే ఉండగా ఏపీ పోలీసులు మాత్రం కేసుల్లో ఇరుక్కున్నారు. ఏపీ పోలీసులపై నాగార్జునసాగర్ విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఏ-1గా ఏపీ పోలీస్ ఫోర్స్‌ను పేర్కొంది. తెలంగాణ భూ భాగంలోకి దౌర్జన్యంగా చొచ్చుకొచ్చారని, సాగర్ కుడి కాల్వ ఐదో గేటు నుంచి ఏపీకి నీటిని వదిలారని, ప్రధాన డ్యామ్‌లోని 13 నుంచి 26 గేట్ల వరకు ఆస్తుల ధ్వంసానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో తెలిపింది.

కేంద్ర హోం శాఖ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

నాగార్జున సాగర్ జలాల విడుదలపై ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న వివాదంపై కేంద్ర హోం శాఖ స్పందించింది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో శుక్రవారం కేంద్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. సాగర్ జలాల విడుదల విషయంలో నవంబరు 28వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగిస్తూ, డ్యామ్ నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అప్పగించడంతో పాటు సీఆర్పీఎఫ్ దళాల పర్యవేక్షణకు అప్పగించాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు

- మిగతా 2 లో

8వ వేతన కమిషన్ లేదు

ఓపీఎస్‌పై త్వరలో నివేదిక ఇస్తాం: సోమనాథన్

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున 50 లక్షల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ వేతన కమిషన్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ప్రణాళిక చేయడం లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి టి.వి.సోమనాథన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ '8వ వేతన కమిషన్ ఏర్పాటు ఆలోచన ఏదీ ప్రస్తుతం లేదు' అని స్పష్టం చేశారు. గతంలో ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, సాయుధ దళాల సిబ్బంది, కుటుంబ పింఛనుదారుల ఓట్లు పొందేందుకు ప్రభుత్వాలు వేతన సంఘం ఏర్పాటు లేదా అమలును సమర్థవంతమైన సాధనంగా ఉపయోగించుకున్నాయి. రాష్ట్ర, అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు నెలల ముందు 2013 సెప్టెంబరులో 7వ వేతన సంఘాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వివాదాస్పదంగా మారిన కొత్త పెన్షన్ పథకం సమీక్షపై దృష్టి సారించడానికి బదులుగా, బీజేపీ అటువంటి చర్య నుంచి దూరంగా ఉంది. ప్రస్తుత పథకం ప్రకారం, ఉద్యోగులు వారి ప్రాథమిక వేతనంలో 10 శాతం జమ చేయగా, ప్రభుత్వం 14 శాతం చెల్లిస్తుంది. ఇది రాజకీయంగా వివాదాస్పదంగా

- మిగతా 2 లో

అమెరికాలో అమానవీయం

భారత విద్యార్థికి ఏడు నెలల నిర్బంధం, బానిసత్వం, వేధింపులు

ముగ్గురు తెలుగు వారు అరెస్టు

వాషింగ్టన్: అమెరికాలో అమానుష ఘటన వెలుగుచూసింది. ఓ భారతీయ విద్యార్థిని బలవంతంగా బానిసత్వంలోకి నెట్టివేసి అనేక నెలలుగా చిత్రహింసలకు గురిచేసిన ఘటన మిస్సోరిలోని సెయింట్ చార్లెస్ కౌంటీలో చోటుచేసుకుంది. 20 ఏళ్ల బాధితుడిని అమెరికా పోలీసులు రక్షించారు. కనీసం టాయిలెట్‌కు వెళ్లనివ్వకుండా అతనిని తీవ్రంగా కొట్టేవారని, వెట్టిచాకిరి చేయించేవారని, నేలపై పడుకోబెట్టేవారని, మూడు గంటలకు మించి నిద్రపోనిచ్చేవారు కాదని, ఏడు నెలలపాటు తీవ్ర వేదనకు గురిచేశారని అధికారులు వెల్లడించారు. విద్యార్థిని బంధించి, అతనితో మూడు ఇళ్లలో బలవంతంగా పనిచేయించారని, పీవీసీ పైపులు, కరెంటు తీగలు, ఇనుప కడ్డీలు, కర్రలు, నీళ్ల పైపులతో శారీరకంగా హింసించారన్నారు. ముగ్గురు తెలుగువారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై అపహరణ, మానవ అక్రమ రవాణా, భౌతిక దాడి వంటి నేరాభియోగాలు మోపారు. నిందితులను వెంకటేశ్ ఆర్ సత్తారు, శ్రావణ్ వర్మ పెనుమెట్చ, నిఖిల్ వర్మ పెన్మత్సగా గుర్తించారు. 911కు సమాచారం అందడంతో పోలీసులు ఆ ఇంటిని తనిఖీ చేసి బాధితుడిని కాపాడారు. తీవ్రగాయాలతో ఉన్న బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ప్రాసిక్యూటర్ జో మెక్‌కుల్చ్ తెలిపారు. ఓ మనిషిని ఇంత హీనంగా చూడటం, కిరాతకంగా హింసించడం అమానవీయం, పైశాచికమని ఆయనన్నారు. బాధితుడి పేరును మాత్రం అధికారులు వెల్లడించలేదు. అయితే అతని వాంగ్మూలం, కోర్టు పత్రాల ప్రకారం బాధితుడు మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్

- మిగతా 2 లో

అజిత్ పవార్‌కు బీజేపీ సుపారీ

ఎన్‌సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్

2లో

ఇదీ లోకం!

ఎగ్జిట్‌పోల్స్‌లో బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిచాను. ప్రమాణస్వీకారం ఎప్పుడు?

సీఎం స్టాలిన్‌తో మాట్లాడండి

- సమస్యకు తెరదించండి
- తమిళనాడు గవర్నర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

చెన్నై: రాష్ట్ర అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపరాదని తమిళనాడు బిల్లుల వివాదంపై సుప్రీంకోర్టు శుక్రవారం అభిప్రాయపడింది. బిల్లులపై ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించుకునేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకోవాలని గవర్నర్ ఆర్ఎన్ రవిని ఆదేశించింది. సీజేఐ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది. ప్రతిష్టంభనను గవర్నర్

- మిగతా 2 లో

68 పాఠశాలలకు బాంబు బెదిరింపు

బెంగళూరులో కలకలం... పోలీసుల అప్రమత్తం

బెంగళూరు: కర్నాటకలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. బెంగళూరులోపలా...బయటా కలిపి 60కి పైగా పాఠశాలలకు శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తుతెలియని ఈ మెయిల్ అడ్రస్ నుంచి ఈ బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. పాఠశాలల్లోనే బాంబులు పెట్టామని ఈ మెయిల్‌లో పేర్కొనడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయకంపితులయ్యారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఇళ్లకు పంపారు. ఈ మెయిల్ బెదిరింపులను తీవ్రంగా పరిగణించాలని, దర్యాప్తు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పోలీసులను ఆదేశించారు. ముందు జాగ్రత చర్యగా రాష్ట్రంలోని పాఠశాలలు, ఆలయాలకు భద్రత కల్పించాలని స్పష్టంచేశారు. ఈ మెయిల్ ఐడీని గుర్తించామని, దీనిని పరిశీలిస్తున్నామని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర చెప్పారు. పోలీసు కమిషనర్, అధికారులతో తాను మాట్లాడానని, అవసరమైన సూచనలు చేశానని తెలిపారు. కాగా మొత్తం 68 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అందులో 48 పాఠశాలలు బెంగళూరు నగరంలో, మిగిలినవి బెంగళూరు రూరల్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. తొలుత ఏడు ప్రైవేటు స్కూళ్లకు ఈ బెదిరింపు

- మిగతా 2 లో

ప్రజాసేవకే అంకితం : చంద్రబాబు

విశాలాంధ్ర-తిరుపతి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన సతీమణి భువనేశ్వరితో కలసి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. చంద్రబాబు దంపతులకు వైకుంఠం కాంప్లెక్స్ వద్ద టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో చంద్రబాబు దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. చంద్రబాబు వెంట మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డితో పాటు అనేక మంది టీడీపీ నేతలు ఉన్నారు. దర్శనానంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ తాను అంచెలంచెలుగా పెరిగి ప్రజా సేవకు అంకితం అయ్యానన్నారు. శ్రీవారిని ప్రార్థించిన తర్వాతే ఏ కార్యక్రమమైనా ప్రారంభిస్తానన్నారు. భారతదేశం ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉండాలనేది తన కోరికని,

- మిగతా 2 లో

ఏపీకి తుపాను ముప్పు

- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- రేపటి నుంచి భారీ వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో మరో రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారిందని, శనివారం కల్లా తీవ్రవాయుగుండంగా, ఆదివారానికి తుపానుగా మారి... సోమవారం సాయంత్రం నాటికి చెన్నై-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం

- మిగతా 2 లో

గాజాలో ఇజ్రాయిల్ వైమానిక దాడులు

మూడు గంటల్లో 100 మంది పలస్తీనియన్ల మృతి

జెరూసలేం: గాజాపై ఇజ్రాయిల్ దళాలు మళ్లీ విరుచుకుపడ్డాయి. కాల్పుల విరమణ గడువు ముగిసిన గంటల వ్యవధిలోనే వైమానిక దాడులు జరిపాయి. శుక్రవారం ఉదయం జరిగిన దాడుల్లో 100 మంది పలస్తీనియన్లు మృత్యువాత పడ్డారు. అనేక మంది గాయపడ్డారు. మూడు గంటల్లో 54 మంది మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. మృతులతో పాటు గాయపడిన వారిలో మహిళలు, పిల్లలే ఎక్కువగా ఉన్నట్లు ఓ ప్రకటన చేసింది. సంధి ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించినందున దాడులను పునఃప్రారంభించినట్లు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. మహిళా బందీలందరినీ విడుదల చేయలేదని, ఇజ్రాయిలీ పౌరులపై రాకెట్లతో దాడి చేసిందంటూ హమాస్‌పై ఆరోపణలు చేశారు. సంధి కాలం ఉదయం 7 గంటలకు ముగియగా అరగంటలోగా దాడులు పునఃప్రారంభిస్తున్నట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. సంధి కాలంలో 240 మంది పలస్తీనియన్లకు ఇజ్రాయిల్ జైళ్ల నుంచి విముక్తి లభించింది. అలాగే 100 మందికి హమాస్ చెర నుంచి విడుదలయ్యారు. హమాస్ నిర్బంధంలో ఇంకా 140 మంది ఉన్నట్లు ఇజ్రాయిల్ చెబుతోంది. నవంబరు 24 నుంచి 30వ తేదీ వరకు కాల్పుల విరమణ అమలైంది. తొలుత నాలుగు రోజులకు సంధి జరుగగా దానిని ఏడు రోజులకు క్రమంగా పొడిగించిన విషయం తెలిసిందే. ఇప్పటికే గాజాలో మృతుల సంఖ్య 20వేల చేరువకు చేరుకోగా సుమారు 80శాతం మంది సర్వం కోల్పోయారని ఐరాస వెల్లడించింది.

నిర్బంధకాండ ఆపండి: ఐరాస మానవహక్కుల హై కమిషనర్

గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ ఏకపక్ష నిర్బంధకాండను తక్షణమే ఆపాలని ఐరాస మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'వెంటనే హింసను ఆపేయాలి. బేషరతుగా బందీలను విడుదల చేయాలి. అధిక జనాభాగల ప్రాంతాల్లో రాకెట్లు, బాంబులలో దాడులను నిలువరించాలి. అవసరార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. మానవతా సాయం నిర్విరామంగా సాగాలి. తదుపరి విపత్తుకర పరిస్థితులను నివారించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పలస్తీనియన్లు, ఇజ్రాయిలీల హక్కులను పరిరక్షించాలి, గౌరవించాలి' అని టర్క్ సూచించారు. అంతర్జాతీయ మానవతా చట్టానికి ఇజ్రాయిల్ కట్టుబడి వ్యవహరించాలని, గాజా స్ట్రిప్‌లోని ప్రజల కనీస అవసరాలను ఇజ్రాయిల్ తీర్చాలని ఆయన కోరారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఎనిమిది మంది పిల్లల్ని కనండి

రష్యా మహిళలకు పుతిన్ విజ్ఞప్తి

మాస్కో: రష్యా జనాభా పెరుగుదల దృష్ట్యా ఎనిమిది కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనాలని దేశ మహిళలకు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కోరారు. పెద్ద కుటుంబాలుగా విస్తరించాలని సూచించారు. రాజధాని మాస్కోలో జరిగిన 'వరల్డ్ రష్యన్ పీపుల్' సదస్సులో పుతిన్ మాట్లాడుతూ '1990 నుంచి రష్యాలో జననాల రేటు తగ్గింది.

ఉక్రెయిన్‌తో యుద్ధం నాటి నుంచి మూడు లక్షల మందికిపైగా చనిపోయారు. రాబోయే రోజుల్లో రష్యా జనాభా పెంపుదల కోసం దేశ మహిళలు కృషి చేయాలి' అని అన్నారు. పాత తరం వారు నలుగురు, ఐదుగురు పిల్లల్ని కనడం వల్ల తమ సమాజం బలంగా ఉందని, గతంలో ఒక్కొక్కరికి ఎనిమిది మంది సంతానం ఉండేవారని పుతిన్ గుర్తుచేశారు. సంతానోత్పత్తి తమకు ఎంతో ముఖ్యమని, గత సంప్రదాయాన్ని కొనసాగించాలని, పెద్ద కుటుంబాలుగా విస్తరించాలని సూచించారు. కుటుంబం... సమాజానికి పునాది వంటిదిగా పుతిన్ తెలిపారు. భవిష్యత్తు తరాలు ఎక్కువ మంది పిల్లలను కనడం ద్వారా రష్యా జనాభాను పెంచడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

దేశద్రోహం కేసులో

మైన్మార్ మాజీ కల్నల్‌కి పదేళ్ల జైలు

నైఫిడో : దేశద్రోహం కేసులో మైన్మార్ మాజీ సైన్యాధికారి యే హ్టుట్ (64)కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. రెచ్చగొట్టే వార్తలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తున్నారన్న ఆరోపణలతో ఈయన అరెస్టుకు గురయ్యారు. 2021లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి జుంటా సైన్యం మయన్మార్ పాలనను చేజిక్కించుకున్నప్పటి నుంచి మైన్మార్‌లో దేశద్రోహం పేరుతో అనేకమందిని జైళ్లకు పంపింది. అవినీతి ఆరోపణలతో పాటు అనేక కేసులు పెట్టి సీనియర్ సైనిక అధికారులను తొలగించింది. యాంగోన్ రీజనల్ మిలటరీ కమాండ్‌కు చెందిన సైనిక అధికారి యే హ్టుట్‌ను దేశద్రోహం ఆరోపణలతో అక్టోబరులో జుంటా ప్రభుత్వం అదుపులోకి తీసుకుంది. ఆయనను దోషిగా నిర్ధారించినట్లు ఓ న్యాయ అధికారి తెలిపారు. పదేళ్ల జైలుశిక్ష విధించినట్లు వెల్లడించారు. మైన్మార్‌పై జుంటా అణచివేతలో 4,204 మంది మరణించగా, 25,474 మంది నిర్బంధానికి గురయ్యారు. కాగా, యే హ్టుట్ 2013 నుంచి 2016 వరకు థీన్‌సీన్ ప్రభుత్వంలో ప్రతినిధిగా వ్యవహరించారు. 2014-16లో సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. అనంతరం రాజకీయ వ్యాఖ్యతగా పనిచేశారు. అనేక పుస్తకాలనూ రచించారు. సింగపూర్‌లోని ఐఎస్ఇఎఎస్-యూసఫ్ ఇషాక్ ఇన్‌స్టిట్యూట్‌లో విజిటింగ్ సీనియర్ రీసెర్చ్‌గానూ ఆయన కొంత కాలం పనిచేశారు.

ప్రజాసేవకే అంకితం : చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

అలాగే, దేశంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలనేది తన ఆకాంక్ష అని, దానికోసమే తాను పని చేస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు రెండు రోజుల తిరుమల పర్యటన ముగించుకుని శుక్రవారం ఉదయం రేణిగుంట నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో చంద్రబాబుకు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, నాయకులు మునిరామయ్య, ఎస్.సి.వి.దిలీప్ నాయుడు, డాక్టర్ సుధాకర్ రెడ్డి, గాలి మబ్బు దేవనారాయణ, శ్రీధర్ వర్మ, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, మునిచంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, మునస్వామినాయుడు తదితరులు ఘన వీడ్కోలు పలికారు.

అమెరికాలో అమానవీయం

(మొదటిపేజీ తరువాయి)

సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువుకునేందుకు గతేడాది అమెరికాకు వచ్చాడు. అతనిని వెంకటేశ్ ఆర్ సత్తారు తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ బంధువులు కావడం గమనార్హం. ఇంటికి తీసుకెళ్లినప్పటి నుంచి విద్యార్థిని వెంకటేశ్ హింసించడం మొదలు పెట్టాడు. బలవంతంగా ఇంటి పనులు చేయించసాగాడు. ఉదయం 4.30కు మొదలుపెట్టి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేదని బాధితుడు తెలిపాడు. వెంకటేశ్ తన ఐటీ సంస్థతో పాటు అతడికున్న మూడు ఇళ్లలో కూడా బాధితుడితో పనులు చేయించేవాడు. ఏడు నెలలుగా అతనిని బేస్‌మెంట్‌లో బంధించారు. అక్కడే కాంక్రీట్ ఫ్లోర్‌పైనే నిద్రించాల్సి వచ్చేది. కనీసం బాత్రూమ్ సదుపాయం లేదని, సరిగా తిండి కూడా పెట్టలేదని బాధితుడు తెలిపాడు. తనపై సీసీ కెమెరాలతో నిఘా పెట్టారని, పని సరిగా చేయకపోతే ముగ్గురు కొట్టేవారని చెప్పాడు. కొన్నిసార్లు దుస్తులు తీయించి, ఒళ్లంతా కుళ్లబొడిచేవారు. ఎలక్ట్రిక్ వైర్లు, పీవీసీపైపులతో దాడి చేసేవారు. అతడి ఒంటిపై గాయాలున్నాయని, కొన్ని ఎముకలు చిట్లాయని అధికారులు పేర్కొన్నారు. 911కి వచ్చిన ఫోన్ ద్వారా పోలీసులు వెంకటేశ్ ఇంటికి వెళితే వారిని లోపలికి రానివ్వలేదు. బేస్‌మెంట్ నుంచి బాధితుడు పరిగెత్తుకొచ్చాడని, ఒంటినిండా గాయాలతో, వణుకుతూ కనిపించాడని అధికారులు వెల్లడించారు. వెంకటేశ్ (35) ప్రధాన నిందితుడు కాగా మిగతా ఇద్దరు నిందితులు నిఖిల్, శ్రావణ్ ... విద్యార్థిని రక్షించిన ఇంట్లో ఉంటున్నట్లు చెప్పారు. తన స్టూడెంట్ వీసా కోసం సహకరిస్తారని అనుకుంటే వారు తన పత్రాలను ధ్వంసం చేశారని బాధితుడు ఆరోపించాడు. వెంకటేశ్ ధనవంతుడని, భారత్‌లోని రాజకీయ నేతలతో సంబంధాలున్నట్లు చెప్పాడు. వెంకటేశ్ ఓ రింగ్ లీడర్ అని, అతనిపై మానవ అక్రమ రవాణాకు దోహదమయ్యే పత్రాల దుర్వినియోగం అభియోగాలను మోపినట్లు పోలీసులు తెలిపారు.

68 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

మెయిళ్లు రాగా... ఆ తర్వాత కొద్దిసేపటికే మరికొన్ని విద్యాసంస్థలకు అదే తరహాలో బెదిరింపులు వచ్చాయి. సమాచారం అందుకున్న పోలీసులు... ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాలల నుంచి బయటకు పంపించారు. తర్వాత బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. వైట్‌ఫీల్డ్, కోరెమంగళ, బసవేశ్వరనగర్, యెళహంక, సదాశివనగర్‌లోని పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి అతి సమీపంలోని పాఠశాలకు కూడా ఈ మెయిల్ రాగా.. ఆయన స్వయంగా అక్కడకు వెళ్లి దానిని పరిశీలించారు. ఒక పాఠశాల విద్యార్థి తల్లిదండ్రులకు అడ్వైజరీ జారీ చేసింది. 'ఈ రోజు మన పాఠశాల అనూహ్య పరిస్థితిని ఎదుర్కొంది. గుర్తుతెలియని వర్గాల నుంచి ఒక మెయిల్ వచ్చింది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే వారిని ఇళ్లకు పంపివేయాలని నిర్ణయించుకున్నాం' అని పేర్కొంది. గత ఏడాది కూడా బెంగళూరులోని ఏడు పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అయితే, అవి నకిలీ బెదిరింపులని తేలింది. ప్రస్తుత బెదిరింపులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇవి కూడా నకిలీ బెదిరింపులే అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మెయిళ్లు పంపిన వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాలపై రుణభారం

(మొదటిపేజీ తరువాయి)

వృద్ధితో పాటు, రుణ స్థాయిని వారి స్థూల దేశీయ ఉత్పత్తిలో 31-32 శాతంగా ఉంచుతుంది. మొత్తం జీఎస్‌డీపీలో 90 శాతం వాటా కలిగి ఉన్న 18 రాష్ట్రాల (మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, రాజస్తాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా, పంజాబ్, బీహార్, చత్తీస్‌గఢ్, హరియాణా, జార్ఖండ్, గోవా) నుంచి అందుబాటులో ఉన్న సంఖ్యల ఆధారంగా నివేదిక రూపొందించబడింది. 2022 ఆర్థిక సంవత్సరంలో స్వల్ప రెవెన్యూ మిగులు తర్వాత, రాష్ట్రాలు 2023 ఆర్థిక సంవత్సరంలో లోటులోకి జారిపోయాయి. ఎందుకంటే మొత్తం వార్షిక ఆదాయం మితంగా 8 శాతం వృద్ధి చెందింది. అయితే ఆదాయ వ్యయం వేగంగా 11 శాతం పెరిగింది. కాగా వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు, కేంద్రం నుంచి వచ్చిన కేటాయింపులు, మద్యంపై పన్నులు, సుంకాల మద్దతుతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం కేవలం 6 నుంచి 8 శాతం మాత్రమే పెరుగుతుందని అంచనా వేయబడింది. అదే సమయంలో రాబడి వ్యయం 8 నుంచి 10 శాతం పెరగనుంది. అధిక నిబద్ధతతో కూడిన వ్యయం ,పెరుగుతున్న సాంఘిక సంక్షేమం, ప్రజారోగ్య సంబంధిత ఖర్చులు కలిపి రాష్ట్రాల మొత్తం ఆదాయ వ్యయంలో 65 శాతం ఉండనున్నాయి. రెవెన్యూ లోటు గత ఆర్థిక సంవత్సరం 0.3 శాతం నుండి ఈ ఆర్థిక సంవత్సరం జీఎస్‌డీపీలో 0.5 శాతానికి చేరుకుంటుంది. ఇది నీటి సరఫరా, పారిశుధ్యం, పట్టణాభివృద్ధి, రోడ్లు, నీటిపారుదల వంటి కీలక మౌలిక సదుపాయాల విభాగాలపై మూలధన వ్యయాలలో 18-20 శాతం లేదా జీఎస్‌డీపీలో 2.3 శాతం పెరుగుదలగా ఉండనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా అధికంగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనూజ్ సేథి పేర్కొన్నారు. అయితే కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందే రూ.1.3 లక్షల కోట్ల విలువైన వడ్డీ లేని (50 ఏళ్ల పాటు) రుణాలు మూలధన వ్యయంలో కొంత భాగాన్ని, పెట్టుబడులను ఉత్ప్రేరపరచడానికి సహాయపడతాయి. ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్రాల జీఎస్‌డీపీలో 3 శాతం రుణ పరిమితిలో ఈ రుణం చేర్చలేదు. 2023 ఆర్థిక సంవత్సరం మాదిరిగానే రాష్ట్రాల రుణభారాన్ని 31-32 శాతం వద్ద ఉంచుతూ రాష్ట్రాల మొత్తం బ్యాలెన్స్ షీట్ రుణాలు, విద్యుత్ రంగం, నీటిపారుదల సంస్థలకు హామీలు వంటి బడ్జెట్-రుణ నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7.5 లక్షల కోట్లు పెరిగి రూ.87 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని క్రిసిల్ డైరెక్టర్ ఆదిత్య ఝూవెర్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర అభివృద్ధి రుణాల ద్వారా చేసిన అప్పులు వారి మొత్తం రుణాలలో 65 శాతం ఉన్నాయి. 2023 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో 28 శాతం పెరిగాయి. కాగా ఆర్థిక కార్యకలాపాల్లో ఏవిధమైన మందగమనమైనా జీఎస్‌డీపీ వృద్ధిని దెబ్బతీస్తుంది. ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. మరోవైపు ఊహించిన దానికంటే మెరుగ్గా పన్ను రాబడి లేదా అధిక గ్రాంట్ల రూపంలో కేంద్రం నుండి మద్దతు రాష్ట్రాలకు మరింత ద్రవ్య స్థిరత్వాన్ని అందించవచ్చునని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది.

ఏపీకి తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

ఉందని వివరించింది. దీని ప్రభావంతో ఆదివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల సీజన్ లో ఏర్పడే తుపాన్లు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో తీరం దాటతాయి. వాతావరణ మార్పు కారణంగా ఈ సీజన్ లో ఇప్పటికే రెండు తుపాన్లు ఉత్తరదిశగా వెళ్లిపోయాయి. తమిళనాడు నుంచి ఏపీ వరకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం దీనికి కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది రెండు తుపాన్లు దిశ మార్చుకోవడంతో రాష్ట్రంలో లోటు వర్షపాతం నెలకొంది. నైరుతి, ఈశాన్య రుతుపవనాల వల్ల ఆశించినంతగా వర్షాలు కురవలేదు. పసిఫిక్ సముద్రం మీదుగా వచ్చే తూర్పుగాలుల ప్రభావంతో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మంచి వర్షపాతం నమోదవుతోంది. గతంలో తూర్పుగాలుల ప్రభావం రాష్ట్రం వరకూ ఉండి సమృద్ధిగా వర్షాలు కురిసేవి. ప్రస్తుతం ఆ గాలులు తమిళనాడు వరకే పరిమితమయ్యాయని వాతావరణ శాఖ నిపుణులు తెలియజేశారు. ఇటీవల కాలంలో తుపాన్ల గమనాన్ని అంచనా వేయడం కష్టమవుతోందన్నారు. ఉష్ణోగ్రతలో 1.5 డిగ్రీల పెరుగుదల, కాలుష్యం అధికమవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని... 'మిచౌంగ్' తుపాను దిశ మార్చుకుంటే ఇప్పట్లో రాష్ట్రంలో వర్షాలు కురిసేందుకు అవకాశాల్లేవని, అది ఉత్తరకోస్తా ప్రాంతంలో తీరం దాటితే కొంతవరకు ప్రయోజనం ఉంటుందని ఏయూ వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు భానుకుమార్ తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ పనులకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా. బీఆర్ అంబేద్కర్ సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ అధికారులు సూచనలు చేశారు. ఇప్పటికే తీరం వెంబడి చలిగాలులు వీస్తుండటంతో తీర ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు.

తుపానుపై నేవీ సన్నద్ధం

తుపాను ముంచుకొస్తున్న వేళ ఎలాంటి విపత్తు నైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తూర్పు నావికాదళం పేర్కొంది. ఈ నెల 3, 4వ తేదీల్లో ఏపీ, ఉత్తర తమిళనాడు మధ్య తుపాను తీరం దాటనుందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో సర్వం సిద్ధం చేసుకున్నామని తూర్పు నావికాదళ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రాష్ట్రాల యంత్రాంగంతో నేవీ విభాగాలు ఎప్పటికప్పుడు చర్చిస్తూ, తుపాను ప్రభావంపై తీసుకోనున్న చర్యల్ని వివరించారు. అధిక సంఖ్యలో నేవీ సిబ్బంది తుపాను విపత్తు చర్యల్లో ఉండటంతో ఈ నెల 4న విశాఖలో నిర్వహించనున్న నేవీ డే వేడులకు వాయిదా పడే అవకాశాలున్నాయని కూడా అధికారులు తెలిపారు. ఇప్పటికే తూర్పు తీరంలో సిబ్బందిని అప్రమత్తం చేయడమే కాకుండా సంరక్షణ సామగ్రి, నౌకల్ని సిద్ధం చేశామని, డైవింగ్ టీంలు రెడీగా ఉన్నాయని తెలిపారు. చెన్నై, విశాఖ తదితర ప్రాంతాల్లోని నావల్ ఎయిర్ స్టేషన్ల వద్ద నేవీ ఎయిర్ క్రాఫ్ట్ ను ఉంచామని స్పష్టం చేశారు. డిసెంబర్ 4న ఏటా విశాఖ సాగర తీరంలో నేవీ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నందున ఈ ఏడాది తుపాను తీవ్రతను బట్టి కార్యాలయంలోనే పరేడ్ నిర్వహించి తుపాను సహాయక చర్యల్లో పాల్గొంటామని వెల్లడించారు.

జల డ్రామా ఫ్లాప్ !

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అంగీకరించాయి. అలాగే శనివారం రెండు రాష్ట్రాల సీఎస్‌లతో ఈ జల వివాదం పరిష్కారానికి కేంద్ర హోం శాఖ, జలశక్తి కీలక సమావేశం నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

ఏపీ హక్కుల రక్షణకు ప్రయత్నించాం : మంత్రి అంబటి రాంబాబు

ఏపీ హక్కులను కాపాడుకునేందుకు ప్రయత్నించామని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. నాగార్జున సాగర్ డ్యామ్ దగ్గర వివాదంపై శుక్రవారం ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు వివరించారు. ఏపీ ప్రభుత్వ చర్య న్యాయమైందంటూ సమర్థించారు. కొందరు రెచ్చగొట్టి గందరగోళం సృష్టించారని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య వైరుధ్యాలను సృష్టించవద్దని, నదీ డ్యామ్‌లో సగం వరకే ఉందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చివరి వరకు మొత్తం ఆక్రమించిందని మండిపడ్డారు. నాడు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చూస్తూ ఊరుకున్నారని, అప్పట్లో నీటి విడుదలకు కూడా తెలంగాణ రాష్ట్రం ఒప్పుకోలేదని గుర్తు చేశారు. ఏపీ భూ భాగంలోకి పోలీసులు వెళితే దండయాత్ర ఎలా అవుతుందని ప్రశ్నించారు. సాగర్ కుడి కాల్వను కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు. ఆంధ్రా వైపునా తెలంగాణ పోలీసులే ఉన్నారని, మన వాటా నీటిని విడుదల చేయాలన్నా, తెలంగాణ రాష్ట్ర అనుమతి తీసుకోవాలని, ఏపీ అధికారులు అక్కడికి వెళ్లాలన్నా, తెలంగాణ పోలీసుల అనుమతి తీసుకోవాలని అంటున్నారని చెప్పారు. సంఘటన ఏపీ భూభాగంలో జరిగితే, తెలంగాణ పోలీసులు కేసు ఎలా నమోదు చేస్తారంటూ ప్రశ్నించారు. నాడు చంద్రబాబు అసమర్థత వల్లే తెలంగాణ పోలీసులు ఏపీ భూ భాగంలోకి వచ్చారని విమర్శించారు. ఏపీ భూ భాగంలోకి మన పోలీసులు, అధికారులు వెళితే అది దండయాత్ర ఎలా అవుతుందని ప్రశ్నించారు.

రాష్ట్రానికి చెందిన వాటాకు మించి ఒక్క నీటి బొట్టు వాడుకోలేదని, ఏపీ వాటాను స్వేచ్ఛగా వాడుకునే హక్కు ఏపీకి కావాలని స్పష్టం చేశారు. తెలంగాణలో వైసీపీ పోటీ చేయలేదని, ఎవ్వరికీ మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తెలంగాణలోని ఏ పార్టీలతోను తమకు సంబంధం లేదని నొక్కిచెప్పారు. తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా స్వాగతిస్తామని అన్నారు.

సీఎం స్టాలిన్‌తో మాట్లాడండి

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించడం మంచిదని తాము అభిప్రాయపడుతున్నామని, ముఖ్యమంత్రితో కలిసి సమస్యను గవర్నర్ పరిష్కరిస్తే అభినందిస్తామని ధర్మాసనం స్పష్టంచేసింది. ముఖ్యమంత్రిని గవర్నర్ ఆహ్వానించి ఉభయులూ కూర్చుని పరిష్కరించుకోవాలని సూచించింది. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లుల్లో 10 బిల్లులను గవర్నర్ ఈనెల మొదట్లో వెనక్కి పంపారు. ఈ బిల్లులు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు వెనక్కి పంపడానికి కారణాలను గవర్నర్ ప్రస్తావించలేదు. దీంతో తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చారు. అసెంబ్లీ రెండోసారి ఆ బిల్లులకు ఆమోదం తెలిపింది. 12 బిల్లులకు ఆమోదం తెలిపే ప్రక్రియలో జరుగుతున్న జాప్యంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇటీవల కేంద్రాన్ని కూడా సమాధానం కోరింది. కోర్టులను పార్టీలు ఆశ్రయించే వరకూ గవర్నర్ ఎందుకు వేచిచూడాలని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. శుక్రవారం విచారణ సందర్భంగా ధర్మాసనం రాజ్యాంగంలోని 200వ అధికరణను ప్రస్తావిస్తూ అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపరాదని తెలిపింది. పెండింగ్ బిల్లులు సహా అనేక అంశాలపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు, గవర్నర్‌కు మధ్య విభేదాలు ముదురుతున్న విషయం విదితమే.

8వ వేతన కమిషన్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

మారింది. అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు పాత పెన్షన్ పథకానికి మారడం వల్ల పెన్షనర్లకు వారి చివరిగా డ్రా చేసిన జీతంలో 50 శాతం నెలవారీగా ఎలాంటి ఉద్యోగుల సహకారం లేకుండా హామీ ఇస్తుంది. ప్రభుత్వం ఈ వ్యవస్థను సమీక్షించేందుకు ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. 'మేము సంబంధిత అందరితో సంప్రదింపులు పూర్తి చేశాం. మా నివేదికను త్వరగా సమర్పించాలి' అని సోమనాథన్ అన్నారు. ఉద్యోగులు తమ చివరి జీతంలో కనీసం 40 నుంచి 45 శాతం పొందేలా ప్రభుత్వం మార్పులు తీసుకురావచ్చు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా 8వ వేతన సంఘాన్ని ప్రకటించి నోటిఫై చేయాలంటూ ఆర్థిక శాఖపై రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. ఆదివారం ప్రకటించబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2024 జాతీయ ఎన్నికలకు ముందు సెమీ ఫైనల్‌గా విస్తృతంగా చూస్తున్నారు.

అజిత్ పవార్‌కు బీజేపీ సుపారీ

ఎన్‌సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్

ముంబై: ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు, సీనియర్ నేత శరద్ పవార్ రాజకీయ జీవితాన్ని అంతం చేసేందుకు అజిత్ పవార్‌కు బీజేపీ సుపారీ ఇచ్చిందని మహారాష్ట్ర మాజీ హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణ చేశారు. భోపాల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం అనంతరం అజిత్ పవార్, 8 మంది ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంలో చేరడం ప్రతి ఒక్కరికీ తెలుసునని శరద్ పవార్ వర్గం నేత దేశ్‌ముఖ్ అన్నారు. 'అజిత్ పవార్ వేరే మార్గం ఎందుకు ఎంచుకున్నారో మీకు తెలుసా? నాకు ఎదురైన అనుభవాన్ని ఎదుర్కొనేందుకు సీనియర్ ఎన్‌సీపీ నేతలకు ఇష్టం లేదు' అని అవినీతి కేసులో తన అరెస్టును పరోక్షంగా ప్రస్తావిస్తూ దేశ్‌ముఖ్ చెప్పారు. ఎన్‌సీపీలో చీలికకు ముందు ప్రధాని చేసిన ప్రసంగాన్ని ఆయన గుర్తు చేస్తూ రూ.70 వేల కోట్ల అవినీతిలో ఎన్‌సీపీ ప్రమేయం ఉందని ప్రధాని ఆరోపించారని చెప్పారు. శరద్‌పవార్ రాజకీయ జీవితానికి ముగింపు పలికేందుకు అజిత్ పవార్‌కు బీజేపీ సుపారీ ఇచ్చిందని విమర్శించారు. అజిత్ పవార్ మద్దతుదారులు ఆయనను సీఎంగా చూడాలనుకుంటున్నారా అని అడిగినప్పుడు రాష్ట్రంలోని అధికార భాగస్వాములు ఏమనుకుంటున్నారో తనకు తెలియదన్నారు. అయితే, ప్రభుత్వంలో కీలక నిర్ణయాలు తీసుకునే విషయంలో అజిత్ పవార్‌ను బీజేపీ దూరంగా పెట్టిందని గుర్తుచేశారు. అజిత్ పవార్ జూలై 2 ఎన్‌సీపీలో తిరుగుబాటు బావుటా ఎగురవేసి, తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరారు. వెంటనే ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.

కుట్రతోనే పర్యాటక శాఖ కార్యాలయం దగ్ధం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వం మారితే తమ అవినీతి బయటపడుతుందనే భయంతో తెలంగాణ పర్యాటక కార్పొరేషన్ కార్పొరేట్ కార్యాలయాన్ని దగ్ధం చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ఆరోపించారు. మొదటి అంతస్తులోఉన్న పరిపాలన విభాగంలో ముఖ్యమైన ఫైల్స్‌ను కావాలనే తగులబెట్టారని... విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదం కాదని ఆయన అన్నారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, పర్యాటక కార్పొరేషన్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి, సహాయ కార్యదర్శి కమతం యాదగిరితో కలిసి నారాయణ సందర్శించారు. మొదటి అంతస్తులో చెల్లాచెదురుగా కాలిపోయి ఉన్న ఫైల్స్‌ను అయన పరిశీలించారు.

ఈ సందర్భంగా నారాయణ మీడియాతో మాట్లాడుతూ... అగ్ని ప్రమాదంపై ఎలాంటి విచారణ జరగకుండా దగ్ధమైన వస్తువులు, ఫర్నిచర్, ఫైల్స్‌ను చెత్తకుండీలో ఎలా పడవేస్తారని ఆయన ప్రశ్నించారు. ఆఘమేఘాలమీద కూలీలను పెట్టి శుభ్రం చేయించడం అనుమానం కలుగుతోందన్నారు. మంత్రికి తొత్తుగా వ్యవహరించి ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేశాడని ఇటీవలే పర్యాటక కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందని గుర్తు చేశారు. ఈ అగ్ని ప్రమాదం వెనుక భారీ కుట్ర ఉందని, ఉన్నత స్థాయి విచారణ జరిపించి నిగ్గు తేల్చాలని నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు నిర్లేకంటి శ్రీకాంత్, బాలకృష్ణ, చైతన్య యాదవ్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఎవరికి పట్టం కట్టారు?

ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో నిజమెంత?

ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

గెలుపు పై ఎవరీ ధీమా వారిదే

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముగిసిన క్రమంలో గెలుపు తమదంటే తమదేనని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం సాగించాయి. రెండు పార్టీల వాగ్దానాలు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. చివరకు ప్రజలు ఏ పార్టీని అదరించారనే విషయం మాత్రం బయటకు రావడం లేదు. ముఖ్యంగా ఈ సారి రాష్ట్రంలో నిశ్శబ్ద ఓటింగ్ తమకు అనుకూలంగా ఉందని కాంగ్రెస్ వ్యక్తం చేస్తుండగా... ఈ ఓటింగ్ ఖచ్చితంగా బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చిందని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇక ఎగ్జిట్ పోల్స్ కూడా తమకు అనుకూలంగా ఉండడంతో మరో అడుగు ముందుకేసి ఈ సారి గెలుపు మాదేనని కాంగ్రెస్ చెబుతోంది. కాగా ఎన్నికలు ప్రారంభమైన రోజు నుంచి వివిధ సర్వేలు కూడా తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోందని భారీగా ప్రచారం చేశాయి. అదేవిధంగా ఎన్నికల అనంతరం వచ్చిన ఎగ్జిట్ పోల్స్ కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడం గమనార్హం. కాని ఈ సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అన్నీ కూడా కేవలం తమ ప్రచారానికి పనికి వచ్చేలా కాంగ్రెస్ పార్టీ డబ్బులు ఇచ్చి మరీ తయారు చేయించిందని బీఆర్ఎస్ ఆరోపించింది. కేవలం ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేలా కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడలు సృష్టించిందని బీఆర్ఎస్ పేర్కొంది. ప్రజలు మార్పు కోరుకున్నారని అందుకే గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు కూడా తెలంగాణ సమాజమంతా తమను ఆదరించారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అసలు ఎగ్జిట్ పోల్స్‌లో నిజమెంతనేది మాత్రం ఎవ్వరికీ అర్థం కావడంలేదు. గత 2018 ఎన్నికల్లో కూడా వివిధ ఎగ్జిట్ పోల్స్ బీఆర్ఎస్‌కు అధికారం వచ్చినప్పటికీ కూడా సీట్ల సంఖ్య తగడంతో పాటు ఓటింగ్ శాతంలో కాంగ్రెస్‌కు భారీగా అనుకూలిస్తుందని నివేదికలు ఇచ్చాయి. కానీ చివరకు వారి అంచనాలు తలకిందులు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అభ్యర్థులు ఎవరూ ఉహించని రీతిలో భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ సారి కూడా అదే పరిస్థితి కొనసాగుతుందనే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా కూడా ఈసారి పురుషుల కంటే మహిళలు ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనడం కూడా ఎవరికీ లబ్ధిచేకూర్చిందో అర్థం కావడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంలో మహిళలకు వివిధ రకాల పథకాలను ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది.

బీచ్‌శాండ్ మైనింగ్ ఆపండి

ఇది దేశభద్రతకు ముప్పు

గవర్నర్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: దేశ అంతర్గత భద్రతతో ముడిపడిన బీచ్‌శాండ్ మైనింగ్ టెండర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం లేఖ రాశారు. బీచ్‌శాండ్ మైనింగ్‌ను ప్రైవేట్ సంస్థలు చేపట్టేందుకు వీలులేకుండా 2019లో కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిందని గుర్తు చేశారు. ఎంఎండీఆర్ చట్టంలో సవరణలు చేసిందన్నారు. బీచ్ శాండ్ మైనింగ్ కేవలం ప్రభుత్వరంగ సంస్థలు మాత్రమే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. బీచ్‌శాండ్‌లో ఆరు ఖనిజాలు లభిస్తాయని, వాటిలో మోనోజైట్ ఖనిజం ప్రధానమైనదని, అందులో అణుధార్మికత కలిగించే థోరియం ఉంటుందని స్పష్టం చేశారు. థోరియంను అణు విద్యుత్ కోసం, ఇతర అణు ధార్మిక శక్తి సృష్టి కోసం ఉపయోగిస్తారని, అణుబాంబు తయారీలోనూ దీనిది కీలకపాత్ర అని తెలిపారు. రూటైల్ అనే మరో ఖనిజం నుంచి టైటానియం తీస్తారని, ఇది ఎంతో విలువైనదన్నారు. వీటిని అత్యంత ముఖ్యమైన ఖనిజాలుగా కేంద్రం గుర్తించినట్లు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోని సముద్రతీర ప్రాంతాలలో అత్యంత నాణ్యమైన ఖనిజాలు ఉన్నట్లు కేంద్ర అణుశక్తి శాఖ నిర్ధారించిందన్నారు. అందువల్ల బీచ్‌శాండ్ తవ్వకాలు, అమ్మకాలు, ఎగుమతుల్లో ప్రైవేట్ సంస్థలను నిషేధిస్తూ అప్పట్లోనే ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేశారు. బీచ్‌శాండ్ మైనింగ్ జరపాలనుకుంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలు లేదా కేంద్రం అనుమతి పొందిన రాష్ట్ర ఖనిజ విభాగాలే చేయాలన్నారు. అందుకు కేంద్ర అణుశక్తి విభాగం అనుమతి తప్పనిసరి చేసిందన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహమంటూ నాటి చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయని రామకృష్ణ విమర్శించారు. బీచ్ శాండ్ మైనింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగడంతో పాటు పర్యాటక రంగం కుదేలవుతుందన్నారు. పర్యాటకులు సముద్రాల వద్దకు వెళ్లేందుకు భయపడతారని పేర్కొన్నారు. ఎంఎండీఆర్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్ ప్రాజెక్టు కాంట్రాక్టును అదానీ కంపెనీకి అప్పగించేందుకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. అందులో 92 శాతం వాటా అదానీ కంపెనీకి ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం టెండర్ ప్రక్రియ చేపడుతుందన్నారు. దేశ భద్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి తాకట్టు పెట్టేందుకు సిద్ధమవడం దుర్మార్గమని విమర్శించారు. గవర్నర్‌గా తక్షణమే స్పందించి బీచ్ శాండ్ మినరల్స్ మైనింగ్ ప్రాజెక్టును ప్రైవేటు సంస్థలకిచ్చే టెండర్ ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు.

ఇంతకాలం ఏమి చేస్తున్నారు: రామకృష్ణ

'తాడిచెట్టు ఎందుకు ఎక్కావంటే దూడగడ్డి కోసం అన్నట్లు' జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. నాగార్జునసాగర్ వద్ద ఏపీ పోలీసులు చేసిన హడావిడిని సమర్థించుకుంటూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సున్నితమైన కృష్ణా జలాల అంశాన్ని మంత్రి అంబటి రాంబాబు వివాదాస్పదం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి రావలసిన హక్కులు, నిధులు తదితరాలపై నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహా వైసీపీ మంత్రులు ఎందుకు నోరు విప్పలేదని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ నుండి ఏపీకి నీరు విడుదల చేసుకోవాలనే ఆలోచన తెలంగాణ పోలింగ్ రోజే ఎందుకు వచ్చిందని, ఈ హైడ్రామా ఎవరి ప్రయోజనాల కోసమని నిలదీశారు. సెంటిమెంట్ రాజేసి కేసీఆర్‌కు మేలు చేయడం కోసం కాదా? నాలుగేళ్లు మౌనం వహించి... టీడీపీపై నెపం వేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. జగన్‌కు ఏపీ ప్రజల ప్రయోజనాల కంటే కేసీఆర్ ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. తెలంగాణలో ఆస్తులు కాపాడుకోడానికే కేసీఆర్‌తో దోస్తీ చేస్తున్నారన్నారు. కృష్ణా జలాల పునః పంపిణీ పేరుతో కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తే రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి పెంచలేదన్నారు. ఈ ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల అంశాన్ని సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

వైసీపీ లేని రాష్ట్రమే లక్ష్యం: పవన్

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ సుస్థిరత, సమైక్యత, అభివృద్ధి కోసమే పనిచేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలిపారు. దేశంలోనే అత్యున్నత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలపడమే లక్ష్యమన్నారు. 'వైసీపీ లేని రాష్ట్రాన్ని తయారు చేద్దాం. ప్రజాకంటకుడు జగన్ ను రాష్ట్రం నుంచి తరిమికొడదాం' అని పిలుపునిచ్చారు. మరో 100 రోజుల్లో జగన్ కోరుకునే... జగన్ ఓడిపోయే యుద్ధం జరగబోతోందని అన్నారు. జగన్ చెప్పినట్లు ఇది కురుక్షేత్రం యుద్ధమే కాకపోవచ్చు కానీ ఏపీ భవిష్యత్తును నిర్దేశించేది మాత్రం అవుతుందని పవన్ చెప్పారు. రాష్ట్రానికి సంబంధించి భవిష్యత్తులో తప్పులు జరగకూడదనేది జనసేన అంతిమ లక్ష్యమన్నారు. జగన్ ఓటమి తర్వాత రాజకీయాల వైపు చూసే పరిస్థితి ఉండరాదన్నారు. మళ్లీ మంచి మనిషిగా మారి, ప్రజలకు చేసిన ద్రోహంపై పశ్చాత్తాపపడిన రోజు మళ్లీ రాజకీయాల్లోకి రానిద్దామన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను ప్రతి దెబ్బకు గుర్తు పెట్టుకుంటా. ప్రతి ఓటమి నన్ను మరింత బలంగా తయారు చేస్తుంది. తన-మన భేదం లేదు. అనుకున్నది సాధించడం... ఆశయం కోసం ముందుకు వెళ్లడమే లక్ష్యం. ఈ ప్రస్థానంలో బయటకు వెళ్లిపోతాననే ఎవరినీ ఆపను. నాకు ప్రజలు, రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యం. నాయకులు కాదు' అని పవన్ ఉద్ఘాటించారు.

ఉద్యోగులను బెదిరించడం ఆపండి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఉద్యోగులను బెదిరించడాన్ని ఆపాలని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ, ఏపీ విజిలెన్స్, యాంటీ పవరు తెఫ్ట స్క్వాడ్ అధికారులకు ఎనర్జీ అసిస్టెంట్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీ పవర్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఉద్యోగంలో చేరిన ఎనర్జీ అసిస్టెంట్లు(జేఎల్ఎం-2) రాష్ట్రంలో 7 వేలమంది పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని విద్యుత్ రంగ సంస్థ సచివాలయాల కింది పని చేయాలని ఆదేశించడం సరికాదని హితవు పలికారు. ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ బోర్డుకు, సచివాలయ సిబ్బందికి చెందకుండా త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నారని ఆరోపించారు. సచివాలయ సిబ్బందికి 8 గంటల పని, సెలవులు, జీతభత్యాలు ఇస్తున్నారని, ఎనర్జీ అసిస్టెంట్లకు మాత్రం అటు విద్యుత్ సంస్థ, ఇటు సచివాలయ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుం టున్నారని ఓబులేసు అన్నారు. ఎనర్జీ సెక్రటరీ, సీఎండీలకు, జేడీఎంలకు, ప్రిన్సిపల్ సెక్రెటరీ, పంచాయతీరాజ్ శాఖకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేనందున డిసెంబర్ నుంచి దశల వారీ ఆందోళనకు దిగుతున్నారని, దీనిని సహించలేని ఈస్ట్రన్ విద్యుత్ పంపిణీ సంస్థ, విజిలెన్స్ అధికారులు బెదిరిస్తున్నారని చెప్పారు. ఉద్యోగాల్లో చేర్చుకొని జీతాలు ఇస్తూ ఇంకొకరి దగ్గర పని చేయమని చెబుతున్న డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు డ్రామాలు మానుకొని సమస్యలు పరిష్కరించాలని, బెదిరింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కాకినాడలో యువగళానికి ఆదరణ

విశాలాంధ్ర-కాకినాడ: తెలుగుదేశం పార్టీ యువనేత లోకేశ్ అధ్వర్యంలో సాగుతున్న యువగళం పాదయాత్రకు కాకినాడలో టీడీపీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం ఉదయం కాకినాడ పరిసర ప్రాంతంలోని చొల్లంగి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర బయలుదేరింది. ఎమ్మెస్ఎన్ చార్టీస్, జగన్నాధపురం ఎన్టీఆర్ బ్రిడ్జి, సినిమా రోడ్డు, కోకిల సెంటర్ మీదుగా కొనసాగింది. లోకేశ్ వెంట కాకినాడ ప్రజలు, జనసేన కార్యకర్తలు నడిచారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత సాయంత్రం నాలుగున్నర గంటలకు పాదయాత్ర మొదలైంది. జేఎన్టీయూ మీదుగా సర్పవరం సెంటర్ చేరుకొంది. అక్కడ బహిరంగ సభ జరిగింది. లోకేశ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధికి పెట్టపీట వేస్తామని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని హామీలిచ్చారు. రాబోయే రెండు నెలల్లో రాష్ట్ర రాజకీయంగా ఎన్నో మార్పులు చేర్పులు జరుగుతాయని లోకేశ్ అన్నారు. కాగా, లోకేశ్ రాత్రికి తిమ్మాపురంలో బస చేశారు.

సాగు, తాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం

రైతు సంఘం ప్రకాశం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : రైతులకు సాగు, తాగు నీరందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. రైతు సంఘం ప్రకాశం జిల్లా 13వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక వడ్డెర అన్నదాన సత్రంలో శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా రైతు సంఘం 13వ మహాసభలు 28, 29 తేదీల్లో త్రిపురాంతకంలో జరగనున్నట్లు ప్రకటించారు. ఈ జిల్లా మహాసభలను జయప్రదం చేయవలసిన బాధ్యత రైతులు, నాయకులు, సీపీఐ అనుబంధ సంఘాలపై ఉందన్నారు. పశ్చిమ ప్రాంత సంజీవని అయిన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసేలా చూడవలసిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు మరమ్మతులు చేయలేని నిస్సహాయ స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం హాస్యాస్పదం అన్నారు. గత సంవత్సరం డ్యామ్‌లో 700 టీఎంసీల నీళ్లు ఉంటే, ఇప్పుడు కేవలం 240 టీఎంసీ నీళ్లు ఉన్నాయని తెలిపారు. నీటిని నిల్వ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నీళ్లు లేక కరువుతో అల్లాడుతుంటే కేవలం కొన్ని మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించడం ఏమిటని, అంటే మిగిలిన మండలాలల్లో అసలు కరువే లేకుండా ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు వ్యవసాయానికి, తాగడానికి నీరు లేక అల్లాడిపోతున్నరని తెలిపారు. ప్రభుత్వం అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవటం దారుణమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనురెడ్డి మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా రైతు సంఘం నాయకులు రాము, నియోజకవర్గ కార్యదర్శి కృష్ణగౌడ్, మండల కార్యదర్శి రామయ్య, పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు చెన్నయ్య, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధి కనిపించదా ?

మంత్రి మేరుగ నాగార్జున ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో బడుగుల అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం చేస్తున్న కృషి చంద్రబాబుకు, ఆయన అనుయాయులకు కనిపించడం లేదా అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముళ్ల పొదలకే పరిమితం చేయాలని చూస్తే... నేడు ఆకాశమంత ఎత్తులో అంబేద్కర్‌ను తమ ప్రభుత్వం నిలిపిందని చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, రామోజీ దళిత వ్యతిరేకులన్నారు. చంద్రబాబు ప్రభుత్వం దళితులపై దాడుల్లో దేశంలో నాల్గోస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అంబేద్కర్ భావజాలంతో సీఎం జగన్ పరిపాలిస్తున్నారని, విద్యకు ప్రాధాన్యమిచ్చి పేదపిల్లలకూ ఇంగ్లీషు అవసరాన్ని గుర్తించిన సంస్కర్త అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా జగన్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. అంబేద్కర్ భావాలను చంద్రబాబు అణగదొక్కారని ఆరోపించారు. సామాజిక విప్లవానికి తెరదీసిన నాయకుడు జగన్ అని చెప్పారు. చంద్రబాబు హయాంలో బెస్ట్ ఎవైలబుల్ స్కూళ్లు అంటూ కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి ఆయన కారకుడయ్యాడని విమర్శించారు.

గొర్రెల, మేకల పెంపకందార్ల

రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి: రామాంజనేయులు

విశాలాంధ్ర-డోన్ : కర్నూలు జిల్లా, డోన్ పట్టణంలో ఈనెల 13న జరిగే గొర్రెల, మేకల పెంపకందార్ల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఏపీ ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు పిలుపునిచ్చారు. డోన్‌లోని నక్కీ రామన్న భవన్‌లో శుక్రవారం సమాఖ్య నంద్యాల జిల్లా కార్యదర్శి ఎం. రామ్మోహన్, సీపీఐ మండల కార్యదర్శి ఎస్.పులిశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణతో సమావేశం నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ నాలుగు లక్షల మంది గొర్రెల, మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచయాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకలను మేపుకునే ప్రభుత్వ బంజరు భూములు, చిన్న కొండలను అధికార పార్టీ నాయకులు కబ్జా చేసి పెంపకందార్ల ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులను అరికట్టడానికి నాలుగుసార్లు మందులివ్వాల్సి ఉండగా ఒకసారి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఆర్భాటంగా గొర్రెల పెంపకదారులను జీవనోపాధిని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి విడుదలవుతున్న కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేదని వెల్లడించారు. పశు బీమా పథకాలు రద్దుచేసి గొర్రెల, మేకల సంరక్షణ, పెంపకదారుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మాదిరి 90 శాతం సబ్సిడీతో రూ.5 లక్షలను పెంపకదారులకు మంజూరు చేయాలని, రుణాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గొర్రెలు, మేకల సహకార సంఘాలకు కొత్త జిల్లాల ప్రకారం ఎన్నికలు జరపాలన్నారు. సీజన్‌వారీగా మందులవ్వడం ద్వారా గొర్రెలు, మేకల మరణాలు తగ్గించాలని, మొబైల్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి సన్న జీవాలకు వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

జగన్... విశాఖకు ఏ ముఖంతో వస్తారు!

గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: 'జగన్ గారూ! విశాఖకు ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు? ఉత్తరాంధ్రకు ఇచ్చిన హామీ ఒక్కటైనా నెరవేర్చారా? ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం నాలుగేళ్ల తొమ్మిది నెలలకు కనిపించిందా?' అంటూ మాజీ మంత్రి, విశాఖ (ఉత్తర) శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు నిలదీశారు. తన పుట్టినరోజు సందర్భంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్న ఆయన అనంతరం ఊరందూరులోని మాజీమంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 8వతేదీ నుంచి తన క్యాంపు కార్యాలయాన్ని విశాఖకు మార్చుతున్నట్లు చేసిన ప్రకటనను శ్రీనివాసరావు విమర్శించారు. రాజకీయ లబ్ది కోసం ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని జగన్ వాడుకుంటున్నారని, అందులో భాగంగానే విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన సుజల స్రవంతి పథకాన్ని జగన్ నీరు గార్చారన్నారు. ప్రధాని మోదీకి భయపడే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై జగన్ మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు. విశాఖ రైల్వేజోన్, మెట్రో ఏమైందని ప్రశ్నించారు. గంగవరం పోర్టును అదానీకి అప్పగించారన్నారు. దొంగ దారుల్లో రిషికొండపై ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నిర్మించారన్నారు. క్యాంపు కార్యాలయం కోసం ఇప్పటి వరకు రూ.457కోట్లు ఖర్చు చేశారన్నారు. రిషికొండపై 144వ సెక్షన్ విధించి ప్రతిపక్ష పార్టీలు కానీ .మీడియాను కానీ అనుమంతించడం లేదన్నారు. జగన్ తీరును ఉత్తరాంధ్ర ప్రజలు గమనిస్తున్నారని... తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. నవరత్నాలు అమలులో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మద్యపాన నిషేధం గాలికి వదిలేశారని, అమ్మఒడిపై జగన్ మాట తప్పారని, సామాజిక భద్రతా పింఛన్ల విషయంలో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జగన్ వచ్చాక ఆంధ్రప్రదేశ్‌కు మంచి పరిశ్రమ ఒక్కటీ రాలేదని, టీడీపీ హయాంలో 25కుపైగానే వచ్చాయని శ్రీనివాసరావు అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ముందు చంద్రబాబు సానుభూతి యత్నం

ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఒక అవినీతి కేసులో నిందితునిగా ఉండి కూడా ఐదారు నెలల్లో జరిగే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సానుభూతి డ్రామాలకు తెరతీస్తున్నారని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా... ఏపీ స్కిల్ డెవలెప్‌మెంట్ కేసులో తీవ్ర అభియోగాలతో రాజమహేంద్రవరం జైలుకెళ్లిన చంద్రబాబు తన వయస్సు, అనారోగ్యం అనే అంశాల ఆధారంగా న్యాయస్థానాల్లో బెయిల్ పొందారని పేర్కొన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన అరెస్టు, నిర్బంధం, అనారోగ్యం కారణాలుగా చూపించి సాధించిన బెయిల్ ఆధారంగా ఆంధ్ర ప్రదేశ్ ఓటర్ల సానుభూతి పొందాలని గట్టి పథకాలే రచిస్తున్నారని విమర్శించారు. తగిన కారణంతో ఏపీ సీఐడీ పోలీసులు అరెస్టు చేసి నిర్బంధంలోకి తీసుకోవడం వల్ల ప్రజల నుంచి చంద్రబాబుకు ఎలాంటి మద్దతు, సానుభూతి రాలేదని తెలిపారు. గతంలో తనపై నక్సలైట్లు జరిపిన దాడిని రాజకీయంగా వాడుకోవాలని చంద్రబాబు చూశారన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుకు ఎలాంటి సానుభూతి రాలేదని, టీడీపీ ఆ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిందని గుర్తు చేశారు. నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వాన బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ మంచి మెజారిటీతో అధికారం కైవసం చేసుకుందన్నారు.

టీమ్ వర్క్‌తో పనిచేసిన నాటక పరిషత్తులకు

డా.వైఎస్సార్ రంగస్థల పురస్కారం

ఏటా 5 లక్షల నగదు బహుమతి... నామినేషన్లకు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ: ఈ ఏడాది నుంచి 'డా. వైఎస్ఆర్ రంగస్థల పురస్కారం' పేరుతో నాటక సమాజాల ప్రోత్సాహానికి ఏటా ఒక అవార్డును ప్రభుత్వం ప్రకటించనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ తుమ్మ విజయకుమార్‌రెడ్డి ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాటక రంగంపై ఆసక్తిగల కళాప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన సమాజాలు, పరిషత్తులను రూ.5 లక్షల నగదు, వైఎస్ఆర్ ప్రతిమ మొమెంటోతో ప్రభుత్వం సత్కరించబోతుందని వెల్లడించారు. నంది నాటకోత్సవాల సందర్భంగా అదే వేదికపై వ్యక్తిగతస్థాయిలో నాటక రంగంలో విశేషకృషి చేసిన నటులకు, కళాకారులకు ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం పేరుతో అవార్డు ప్రదానం చేయనున్నదని తెలిపారు. ఇప్పుడు మొదటిసారి ఈ రంగంలో సమిష్టి కృషితో (టీమ్‌వర్క్) పనిచేసిన సమాజాలకు, పరిషత్తులకు ఈ అవార్డుతో గుర్తింపు లభించనుందన్నారు. ఆదరణ తగ్గుతున్న ఈ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం వల్ల దీనికి పూర్వవైభవం లభించాలనే కళాభిలాషుల ఆకాంక్ష నెరవేరనుందన్నారు. డా.వైఎస్సార్ రంగస్థల పురస్కారాలకు అర్హులైన వ్యక్తులు, సమాజాలు, పరిషత్తులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను డిసెంబర్ 10వ తేదీలోగా పంపాలని కోరారు. ఈ పురస్కారాల ప్రదానం డిసెంబర్ చివరి వారంలో నిర్వహించే నంది నాటకోత్సవాలు 2022 వేదికపై జరుగుతుందని విజయకుమార్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ రీజియన్ బదిలీకి అనుమతించండి

పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ విన్నపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగులకు ఇంటర్ రీజియన్ బదిలీలకు అనుమతివ్వాలని పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్రంలో విభజిత జిల్లాలకు ముందు ఆర్టీసీ రీజియన్ల పరిధిలో నియమితులైన వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది...తమ కుటుంబ అవసరాల నిమిత్తం, ఆరోగ్య కారణాలతో డిప్యుటేషన్ల బదిలీపై ఇతర రీజియన్లలో పనిచేస్తూ ఉన్నారని వివరించారు. డిప్యుటేషన్లపై పనిచేస్తున్న సిబ్బందికి యేటా ప్రధాన కార్యాలయం నుంచి పొడిగింపు లభిస్తుందని తెలిపారు. ఇలా కాకుండా సిబ్బంది అంగీకారంతో ఇంటర్ రీజియన్లకు బదిలీ చేయాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులను 2019 ఆగస్టులో ఇంటర్ రీజియన్ బదిలీలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అన్ని డిపోలలోను ఖాళీలు ఉన్నందున ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ చేయాలని కోరారు.

ఆ రైతులకు రూ.25 లక్షల సాయం

గవర్నర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కరువు కారణంగా ఆత్మహత్య చేసుకున్న రైతులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కాంగ్రెస్ ఏపీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కోరారు. ఇదే అంశమై శుక్రవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రుద్రరాజు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు, కరువు కాటకాలు, వలసలతో రాష్ట్రం దుర్భిక్షంగా మారిందని అన్నారు. పల్నాడు జిల్లా రైతు శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకోవడంతో పాటు కర్నూలు, ఆదోని తదితర ప్రాంతాలలో రైతుల ఆత్మహత్యలు గురించి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కరించేలా ప్రభుత్వానికి సూచించాలని కోరామన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, రాష్ట్ర రైతు శాఖ చైర్మన్ జెట్టి గురునాధరావు, కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు ఉన్నారు.

ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. స్థానిక మేఘన హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంఘం సర్వసభ సమావేశం జరిగింది. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలపై సభ్యులు చర్చించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఇతర ఉద్యోగ సంఘాలతో కలిసి పోరాడాలని నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కళ్లేపల్లి మధుసూదనరాజు 5వ సారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.కమ్మన్న, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బీరం వెంకట రమణ, కోశాధికారిగా ఎం.ధనుంజే యులు, సహాయ కార్యదర్శిగా హెచ్.శ్రీనివాసులు, ప్రాంతీయ అధ్యక్షుడిగా సత్యం బాబు, ప్రాంతీయ కార్యదర్శులుగా కొండపల్లి భాస్కరరావు, సుంకర నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

సంపాదకీయం

"ఇండియా"కు ఊతమిస్తున్న ఎగ్జిట్ పోల్ ఫలితాలు

ఎన్నికలు ముగిసిన తరవాత ఎగ్జిట్ పోల్ ఫలితాలు వెలువడడం ఒక ఆనవాయితీ అయింది. ఈ జోస్యాలు ఏ మేరకు నిజమవుతాయన్న మీమాంస ఎప్పుడూ ఉంటుంది. అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు ముగిసిన తరవాత కనీసం పది సంస్థలు తమ ఎగ్జిట్ పోల్ వివరాలు ప్రకటించాయి. అన్ని చోట్లా గెలుపు తమదే అనుకునే రాజకీయ పార్టీలు ఎప్పుడూ ఉంటాయి. ఆదివారం సాయంత్రానికి అసలు ఏ పార్టీ పస ఎంతో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ జోస్యాలు నిజమవుతాయా కావా అన్న విషయాన్ని పక్కన పెట్టినా ఇవి కొన్ని ఆశ్చర్యకరమైన ధోరణులను తెలియజేస్తున్నాయి. మొదటిది మధ్య ప్రదేశ్‌లో బీజేపీ ఓటమి ఖాయం అనుకున్న చోట అక్కడ బీజేపీ గెలుస్తుందని ఎగ్జిట్ పోల్ ఫలితాలను చూస్తే అర్థం అవుతుంది. రెండవది తెలంగాణలో అత్యంత పదిలింగా ఉందనుకున్న కె.సి.ఆర్. నాయకత్వం లోని బి.ఆర్.ఎస్. కాళ్ల కింది నేల జారిపోతోందనిపిస్తోంది. అక్కడ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అనేక ఎగ్జిట్ పోల్స్ ఘోషిస్తున్నాయి. మధ్యప్రదేశ్ లోనే మోదీ, అమిత్ షా తక్కువ ప్రచారం చేశారు. వీరిద్దరూ నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన శివరాజ్ సింగ్‌ను బహిరంగానే ఉపేక్షించారు. మోదీ శివరాజ్ సింగ్‌ను ఎప్పుడూ అనుమాన దృష్టితోనే చూశారు. ఇంకా చెప్పాలంటే చవాన్ తనకు ప్రత్యర్థిగా భావించారు. 2024 ఎన్నికలలో ఒక వేళ బీజేపీ విజయం సాధించినా మోదీ ప్రధానమంత్రి కారేమోనని వెలువడుతున్న ఊహాగానాలను గమనిస్తే శివరాజ్ సింగ్ గెలుపు బాట పట్టడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నాయకుల మధ్య ముఠా తగవులున్నాయి. పైగా ముఖ్యమంత్రిని అధినాయకత్వం ఉపేక్షించింది. ఒక వేళ అక్కడ బీజేపీ గెలిచినా శివరాజ్ సింగ్ ముఖ్యమంత్రి కాబోరన్న సంకేతాలూ బలంగానే వచ్చాయి. కేంద్ర మంత్రి నరేంద్ర తోమార్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగింది. సింధియా, కైలాశ్ శర్మ, నరోత్తం మిశ్రా పేర్లూ ప్రచారంలోకి వచ్చాయి. శివరాజ్ సింగ్ దాదాపు ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం అక్కడ బీజేపీ గెలిచినా ఆ ఖ్యాతి శివరాజ్ సింగ్ చౌహాన్‌కే దక్కాలి. ఆక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వాస్తవ ఫలితాలకు దగ్గరగా ఉంటాయన్న అభిప్రాయం ఉంది. ఆ సంస్థ మళ్లీ బీజేపీ గెలుస్తుందని చెప్తోంది. ఈ సంస్థ ఎగ్జిట్ పోల్ ఫలితాలు 94 శాతం వాస్తవానికి దగ్గరగా ఉంటున్నాయి. ఆ సంస్థ బీజేపీకి 140 నుంచి 162 సీట్లు దక్కోచ్చునంటోంది. ఇండియా టీవీ-సి.ఎన్.ఎన్. సంస్థ బీజేపీకి 140 నుంచి 159 సీట్ల దాకా రావచ్చునంటోంది. ఆక్సిస్ సంస్థ కాంగ్రెస్ 68 నుంచి 90 స్థానాలకు పరిమితం అవుతుందంటోంది. ఈ మాట జనంలో ఉన్న అంచనాలను కూడా తలకిందులు చేస్తుంది. వాస్తవ ఫలితాలు ఎగ్జిట్ పోల్ ఫలితాలు నిజం అని తేలిస్తే శివరాజ్ సింగ్‌ను మోదీకి నిజంగానే ప్రత్యర్థిగా నిలబెడ్తుంది. ఛత్తీస్‌గఢ్ లోనూ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి డా. రమణ్ సింగ్‌ను బీజేపీ అగ్ర నాయకత్వం ఇన్నాళ్లూ పక్కన పెట్టింది. అక్కడ కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి. బీజేపీ ఓడినా ఆ అవమాన భారం రమణ్ సింగ్ మీద మోపే అవకాశం ఉండదు.

రాజస్తాన్‌లో పాగా వేయాలని బీజేపీ సకల ప్రయత్నాలూ చేసింది. మోదీ, అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నడ్డా దాదాపుగా గత 20-25 రోజుల నుంచి అక్కడే కాపురం పెట్టినంతగా ప్రచారం చేశారు. పైగా గత మూడు దశాబ్దాలుగా రాజస్థాన్‌లో వరసగా రెండో సారి నెగ్గలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. నిజానికి ఇది మూఢ నమ్మకం లాంటిదే. కేరళలో వామపక్ష ఫ్రంట్ వరసగా రెండో సారి గెలిచిన సందర్భం కళ్ల ముందుంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు కూడా కాంగ్రెస్ గెలుపు ఖాయం అంటున్నాయి. రాజస్తాన్ ముఖ్యమంత్రి గెహ్లోత్‌దీ ఓ విషాద గాథ. కిందటి సారి గెలవక ముందు కాంగ్రెస్ గెహ్లోత్‌ను ఉపేక్షించింది. పైగా మొన్న మొన్నటి దాకా గెహ్లోత్‌కు, సచిన్ పైలెట్‌కు శ్రుతి కలిసేది కాదు. చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. అయినా ఈ బంధం ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఏ మేరకు ఉపకరించిందో తెలియదు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ శాసనసభ్యుల మీద కొంత వ్యతిరేకత ఉండొచ్చు. కానీ ముఖ్యమంత్రి గెహ్లోత్ మీద ఆదరణే ఉంది. కొన్ని నెలలుగా గెహ్లోత్ అనేక ప్రజోపయోగ పథకాలు ప్రారంభించారు. సంజీవిని లాంటి పథకాలను అందరూ ప్రశంసిస్తున్నారు. అనేక అనుకూల పరిస్థితుల మధ్య గెహ్లోత్ నాయకత్వంలోని కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే అయిదేళ్లకోసారి రాజస్తాన్‌లో ప్రభుత్వం మారాల్సిందేనన్న మూఢ విశ్వాసానికి తెరపడ్తుంది. గెహ్లోత్ పథకాలను జనం కేవలం తాయిలాలుగా భావించడం లేదు. ఎందుకంటే అవి అమలవుతున్నాయి. తెలంగాణ ఫలితాల గురించిన అంచనాలు చాలా ఆశ్చర్యజనకంగా ఉన్నాయి. కిందటి ఆరు నెలల దాకా నిర్జీవంగా ఉన్న కాంగ్రెస్ ఒక్కసారిగా పుంజుకుంది. ఈ సారి కె.సి.ఆర్. కు ఓటమి తప్పదని అనేక ఎగ్జిట్ పోల్ సంస్థలు వెల్లడించాయి. నిజానికి రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రాణం పోసింది. 2018లో కాంగ్రెస్ సాధించింది 22 శాతమే. గెలవాలంటే కాంగ్రెస్ చాలా దూరమే నడవాలి. బీజేపీ తెలంగాణలో ఈ సారి మాదే గెలుపు అని ఇటీవలి కాలం దాకా టముకు వేసి మరీ చెప్పుకుంది. చివరి క్షణంలో వెనక్కు తగ్గింది. కె.సి.ఆర్. గెలిచినా తమకు అనుకూలంగానే వ్యవహరిస్తారన్న భరోసా బీజేపీకి ఉండొచ్చు. కె.సి.ఆర్.ను గద్దె దించగలిగితే కాంగ్రెస్ దుర్భేదం అనుకున్న కోటను కూల్చడమే. పొరుగు రాష్ట్రమైన కర్నాటకలో విజయం కావలసిన స్ఫూర్తి నింపింది. తెలంగాణ ఇచ్చింది సోనియా గాంధీయేనన్న అభిప్రాయమూ చాలా మందిలో గూడు కట్టుకుంది. కె.సి.ఆర్. సైతం ఆ మాట ఒప్పుకున్నారు. తెలంగాణలో బి.ఆర్.ఎస్. శాసనసభ్యుల మీద ఫిర్యాదులున్నా కె.సి.ఆర్. మంత్రులకే దర్శన సులభుడు కాదన్న భావనా బలంగా ఉంది. తెలంగాణలో కూడా హిందుత్వ జ్వరం ఎక్కించాలని బీజేపీ నాయకత్వం గట్టి ప్రయత్నమే చేసింది. కానీ మతతత్వం ఆసరాగా జనం సమీకృతం అయ్యే పరిస్థితి తెలంగాణలో లేదు. వచ్చే జనవరిలో అయోధ్యలో రామమందిరం ఆవిష్కరణ జరుగుతుందని, హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మారుస్తామన్న ప్రచారాన్ని జనం పట్టించుకున్నట్టు లేదు. ఇలాంటి ప్రకటనలు తెలంగాణ ప్రజలను ఎప్పుడూ ఆకట్టుకోలేదు. బీజేపీకి, బి.ఆర్.ఎస్.కు ఉన్న సంబంధాలను రాహుల్ గాంధీ తీవ్రంగా దుయ్యబట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు దేశ రాజకీయాలను, ముఖ్యంగా "ఇండియా" ఐక్య సంఘటనపై సానుకూల ప్రభావం చూపడం ఖాయం.

బడా కంపెనీల పురుగు మందుల వ్యాపారం!

బొల్లిముంత సాంబశివరావు

ఆహార పంటల ఉత్పత్తిలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తీవ్రరూపం దాల్చింది. అవి లేకుండా దిగుబడులు రాని పరిస్థితి ప్రపంచ వ్యాపితంగా ఏర్పడింది. పురుగుమందుల వినియోగం నిరంతరం సేద్యంలో పెరుగుతుండటంతో, వాటి ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నాయి. వినియోగం, పెరుగుదల బడా పురుగుమందుల కంపెనీలను లాభాలబాట పట్టిస్తున్నది. గత మూడు దశాబ్దాల్లో పురుగుమందుల వాడకం చాలా ఎక్కువగాఉంది. ప్రపంచవ్యాప్తంగా 2019లో వ్యవసాయ పురుగుమందుల వాడకం 4.19బిలియన్ మెట్రిక్ టన్నులకు చేరింది. ఇది హెక్టార్‌కు 2.69కేజీలు ఉంది. ప్రపంచ వ్యాపితంగా వినియోగించే పురుగుమందుల్లో సగానికిపైగా వినియోగించే ప్రాంతం ఆసియా పసిఫిక్. పంటభూమిలో అత్యధికంగా పురుగుమందులు వినియోగించే దేశాలు ఆసియా, అమెరికాలు. మనదేశంలో పురుగు మందుల తయారీ 1952లో ప్రారంభమైంది. బెంజిన్ హెక్సాక్లోరైడ్, దాని తర్వాత డిడిటి ఉత్పత్తి జరిగింది. 1958లో 5వేల మెట్రిక్ టన్నుల పురుగుమందుల ఉత్పత్తి జరిగింది. 1990ల మధ్య కాలంలో 145పురుగు మందుల నమోదుతో ఉత్పత్తి 85వేల టన్నులకు పెరిగింది. క్రమంగా 90వేల టన్నుల వార్షిక ఉత్పత్తితో ఆసియాలో పురుగుమందులు ఉత్పత్తిచేసే ప్రముఖ దేశాల్లో భారత్ ఒకటిగా ఉంది.

మనదేశంలో వ్యవసాయంపై 100 కోట్ల మంది ప్రజలు ఉపాధి పొందుతున్నారు. రైతు సేద్యం ఇప్పటికీ వెనకబడే ఉంది. పాలకుల చేయూత లేకపోవటమే దీనికి ప్రధానకారణం. పంటలకు చీడపీడల బెడద రైతాంగాన్ని వెన్నంటుతూనే ఉంది. మొదట తెగుళ్ల నివారణకు రైతాంగం సాంప్రదాయ పద్ధతుల్లో బూడిద, వేప పిండి, వేప పసరు వంటివి వినియోగించారు. ఆ తర్వాత డిడిటి ఎక్కువగా ఉపయోగించారు. 1966లో పాలకులు సశ్యవిప్లవం ప్రకటించి అధిక దిగుబడులకోసం హైబ్రీడ్ విత్తనాలు దిగుమతి చేసుకున్నారు. ఆ విత్తనాలతోపాటు వాటినుంచి వచ్చే కొత్తతెగుళ్లు దిగుమతి అయ్యాయి. వాటి నివారణకు ఆ కంపెనీలే పురుగు మందులను దేశానికి పంపాయి. ఆ విధంగా రసాయనిక పురుగుమందులు సేద్యంలోకి ప్రవేశించాయి.

పురుగుమందుల ఉత్పత్తి: విదేశీ తెగుళ్ల వలన పంటను కాపాడుకోవటానికి విపరీతంగా రసాయనిక పురుగుమందులను వినియోగిస్తున్నారు. 2015-2022 మధ్య భారతదేశం అంతటా ఉత్పత్తిచేసిన పురుగుమందుల పరిమాణం 1000వేల మెట్రిక్ టన్నులుగా 16-5-2023న స్టాటిస్టా రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ ప్రచురించింది. 2022 ఆర్థిక సంవత్సరంలో 229వేల మెట్రిక్ టన్నుల పురుగుమందులు ఉత్పత్తి జరిగిందంటే, సేద్యంలో పురుగుమందులవాడకం ఎంత మోతాదులో జరుగుతున్నదో అర్థమౌతుంది. 2020-2022 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం ప్రచురించిన నివేదిక ఆధారంగా వార్షిక పురుగుమందుల వాడకం 40వేల మెట్రిక్ టన్నులగా ఉంది.

పురుగు మందుల ఉత్పత్తిలో కీలక రసాయనం అయిన మాలిక్యూల్స్ తయారుచేసే కంపెనీలు భారత్‌లో దాదాపు 80దాకా ఉన్నాయి. ఫార్ములేషన్ (తుది ఉత్పాదన) రూపొందించే కంపెనీలు 2వేలు ఉన్నాయి. మాలిక్యూల్స్ తయారీకి కావాల్సిన ముడిసరుకు విదేశాల నుండి దిగుమతి అవుతుంది. దీని ధర కంపెనీల ఇష్టానుసారంగా ఉంటుంది. ఫలితంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ కంటే

భారతదేశంలో పురుగుమందుల ధర 40శాతం ఎక్కువ. దేశంలో 18వేల కోట్ల రూపాయల పురుగుమందుల వ్యాపారం జరుగుతున్నది. 50లక్షల మంది ఈ రంగంలో ఉన్నారు. పురుగుమందుల తయారీలో ఉన్న భారతీయ కంపెనీల మనుగడ సంక్షోభంలోపడే పరిస్థితి ఏర్పడింది. మోదీ ప్రభుత్వం పెస్టిసైడ్ మేనేజ్ మెంట్ బిల్లు 2017లో తీసుకు వచ్చింది. ఈ బిల్లు బహుళజాతి కంపెనీలకు మరింతగా సహకారాన్ని అందిస్తుంది. ఈ బిల్లు అమలులోకి వస్తే దేశీయ కంపెనీల మనుగడ కష్టమని పరిశ్రమవర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇక్కడి మార్కెట్లో ఎమ్మెన్సీలు 40శాతం దాకా ఒప్పందాలు చేసుకున్నాయి. ఇన్‌సెక్టిసైడ్స్ యాక్టు 1968 ప్రకారం భారత్‌లో విదేశీ కంపెనీలు పురుగుల మందులు విక్రయించాలంటే సెంట్రల్ ఇన్‌సెక్టిసైడ్స్ బోర్డు అండ్ రిజర్వేషన్ కమిటీలో మాలిక్యూల్(రసాయనం) నమోదు తప్పనిసరి. అది సెక్షన్9 (3) కింద నమోదు జరుగుతుంది. ఇదే మాలిక్యూల్ భారత కంపెనీలు తయారు చేయాలంటే సెక్షన్ 9(4)కింద దరఖాస్తు చేయాలి. రిజిస్ట్రేషన్ లేకుండానే 2007 నుంచి భారత్‌లో విదేశీ కంపెనీలు 127 ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. వీటి వ్యాపారం సాలీనా 7వేల కోట్లు. మోదీ ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదు. కనీసం నాణ్యతను కూడా పరీక్షించటం లేదు. సుమారు 100 మాలిక్యూల్స్‌ను ఎమ్మెన్సీలు తమ చేతుల్లో పెట్టుకుని భారత్ మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఎమ్మెన్సీల చేతుల్లో ఉన్న ఫార్మేషన్‌ను దేశీయ కంపెనీలు తయారుచేసేందుకు వీలుగాఉన్న ఇన్‌సెక్టిసైడ్స్ యాక్టులో ఉన్న 9(4) నిబంధనకు మోదీ ప్రభుత్వం తెచ్చిన బిల్లు ప్రమాదంగాఉంది. యాక్టులో ఉన్న 9(4) కొనసాగించాలని దేశీయ కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. దాన్ని కొనసాగించకపోతే భారత కంపెనీల మనుగడ ప్రశ్నార్థకమౌతుంది.

బడా కంపెనీల లాభాలు: పురుగుమందుల వ్యాపారంలో సింజెంటా ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. పురుగుమందుల అమ్మకాల్లో దాదాపు 13.3 బిలియన్ డాలర్లను ఆర్జించింది. ఈ అమ్మకాల్లో భారతదేశంలో దీని వాటా 3శాతంగా ఉంది. దీన్ని 10శాతం పెంచాలన్నది యోచన. దీని తర్వాత రెండవ అతిపెద్ద పురుగుమందుల కంపెనీ బేయర్స్ క్రాప్ సైన్స్: ఇది బేయర్ ఏజి ఉప కంపెనీ. దీని పురుగుమందుల అమ్మకాలు 11.3 బిలియన్ల అమెరికా డాలర్లు. 2021లో విత్తనాలు, పురుగుమందుల అమ్మకాలతో సహా దీని ఆదాయం 20బిలియన్ల యూరోలుగా ఉంది. మన దేశంలో దీని వ్యాపారం విస్తరించింది. బడా కంపెనీలన్నీ గుత్తాధిపత్యం కోసం విలీనాలు, కొనుగోళ్లకు సిద్ధమయ్యాయి. దే కెమికల్ ఈ డిపాంట్, దె నిమోరస్ మధ్య 2017లో విలీనం జరిగింది. 2018లో మోన్‌శాంటోను బేయర్ కొనుగోలు చేసింది. రసాయన పురుగుమందుల వినియోగంతో పొలాలనుంచి ప్రవహించేనీరు స్థానిక నీటి వనరులైన చెరువుల, సరస్సుల్లోకి ప్రవేశించి వాటి నీటిని కలుషితం చేస్తాయి. కలుషిత నీటితో జీవరాసులు చనిపోతాయి. సర్వేల ప్రకారం పెద్దఎత్తున చేపలు చనిపోవటానికి పురుగుమందులే ప్రధాన కారణం. తీవ్రమైన పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. విషపూరిత పురుగుమందులను పైర్లపై చల్లటంవలన ఆహార ఉత్పత్తుల్లో విషంచేరి ప్రజలు అనేక రోగాలకు గురై చనిపోతున్నారు. పురుగుమందులు పిచికారిచేసే కూలీలు విషవాయువులు పీల్చటంతో ప్రాణాలు కోల్పోతున్నారు. వేలసంఖ్యలో ఇలాంటి మరణాలు సంభవించాయి. ప్రజల ప్రాణాలకు విలువఇవ్వని బడా కంపెనీలు, ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమైన అత్యంత విషపూరిత పురుగుమందులు తయారుచేసి కోట్లాది రూపాయలు లాభాలు పొందుతున్నారు. వాటి ధరలు పెరగడంతో సేద్యపు ఖర్చులు పెరిగి రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన సేద్యపు ఖర్చులకు అనుగుణంగా పంటలకు ధరలు లభించక పోవటంతో అప్పులపాలై ప్రాణాలు కోల్పోతున్నారు.

విషపూరిత పురుగుమందులపై కఠినమైన ఆక్షలు విధించాలని, విదేశీ దిగుమతులను పరిమితం చేయాలని, వాటి నాణ్యతను పరీక్షించిన తర్వాతే అనుమతించాలని, దేశ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పురుగుమందులను ప్రభుత్వ సంస్థలే ఉత్పత్తి చేయాలని యావన్మంది రైతాంగం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ ఉద్యమించాలి.

సెల్: 9885983526

ఆకాశవాణి విజయవాడ కేంద్రం

"గంగ ఉదకము తెచ్చి నీకు లింగ పూజలు చేదుమంటే..."

తెలతెలవారుతూండగా మంగళపల్లి బాలమురళీకృష్ణ గానం. నేల మీద ముడుచుకు పడుకున్న వారిని ఆ భక్తిరంజని కార్యక్రమం నిద్ర లేపేది. ఆ తర్వాత పాడిపంటలు. " అదిగో ఎనిమిది కావస్తోంది. పొయ్యి మీద ఎసరు ఇంకా కాగుతూనే ఉంది. లెండి. ముఖాలు కడుక్కోండి. టైం అవుతోంది" అని మధ్యతరగతి ఇళ్లల్లో అమ్మలు, అమ్మమ్మలు చేసే హడావుడి ఇంకా చెవుల్లోనే ఉంది. ఈ రెంటికి మధ్యలో "ఇతి వార్తాహ సూయాన్తాం. ప్రవాచికా బలదేవానంద సాగరహ" సంస్కృతంలో వార్తలు. అర్థమయ్యేది కాదు కాని.... ఆ పలకరింపు ఓ ఆత్మీయంగా ఉండేది. మళ్లీ తెలుగులో అవే వార్తలు. ఈసారి చదివేది మాత్రం అచ్చ తెలుగు రెంటాల గోపాలకృష్ణ, ఒక్కోసారి అద్దంకి మన్నార్. ఉదయం స్కూళ్లకి పరుగులు పెట్టడానికి తెలిసే టైం ఆకాశవాణి వివిధ భారతి. ఆనాటి ప్రతి ఇంట్లోనూ టైంకి అన్ని జరిగిపోవడానికి వినిపించే వాచీ ఈ రేడియోనే. మధ్యాహ్నం సిలోన్ నుంచి వచ్చే పాటలు ఆ రోజంతా వెంటాడేవి. బినాకా గీత్ మాలా గుర్తుందా... రేడియోలని చెవికి అతుక్కుని యువతరం వినే పాటలు. మరచిపోయిన పాటల పూదోట పూలే బిన్సే గీత్ ఎంత మధురంగా ఉండేది. నిజానికి అవేవి మరచిపోయిన గీతాలు కాదు. వెంటాడే గొంతుకలు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అరగంటలోపే తొలితరం వాగ్గేయకారుడు బాలాంత్రపు రజనీకాంతరావు రాసి, టంగుటూరి సూర్యకుమారి గానం చేసిన రూపకం "మొయింపు జయభేరి... వాయింపమనగరా" మన ఆకాశవాణిలోనే ప్రసారం

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

అయ్యింది. దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చేసిన "ట్రీస్ట్ విత్ డెస్టినీ" గా పిలుచుకునే తొలి ప్రసంగం తర్వాత మన బాలాంత్రపు రజనీకాంతరావు ఈ తెలుగు రూపకం వచ్చిందంటే నేటితరం నమ్మగలదా. మళ్లీ రజనీకాంతరావే. జపాన్ రేడియో హెూసోక్యోటో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను పోటీకి ఆహ్వానించిన కార్యక్రమాల్లో విజేత రజనీకాంతరావే.. గోదావరి పుట్టుపూర్వోత్తరాలపై రజనీకాంతరావు రాసిన కొండ నుంచి కడలి దాకా రూపకం ఆ ప్రతిష్టాత్మకమైన అవార్డు అందుకోవడం మన ఆకాశవాణి మనకి మిగిల్చిన వైభవం. అన్నట్లు ఈ పోటీకి ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఎంట్రీలు 30. వాటిలో మనదే మొదటి బహుమతి. సంగీతంలో విశిష్టమైన కల్యాణి రాగం పుట్టుక మన ఆంధ్రదేశంలోనే. దీన్ని నిర్ధారించేందుకు, మా తెలుగుకు ఇంత మహత్తర సంగీత నిధి ఉంది అని చెప్పేందుకు బాలాంత్రపు రజనీకాంతరావు రాసిన మరో రూపకం ఆంధ్రీకల్యాణి. చరిత్రలో కొట్టుకుపోయాయనుకున్న వాటిని పట్టి తెచ్చి ప్రపంచానికి చూపించింది విజయవాడ ఆకాశవాణి కేంద్రమే. 60, 70 దశకాల్లో విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఓ భువన విజయంలా ఉండేదని రజనీగారే నా ఇంటర్వ్యూలో అన్నారు. తన 95 వ ఏట సినిమాల్లో నారదుడిగా వేషం వేసిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ యక్షుడు వేషం వేసింది కూడా విజయవాడ ఆకాశవాణి కేంద్రంలోనే. కాళిదాసు మేఘసందేశం కావ్యాన్ని బాలాంత్రపు వారు తెలుగులో రూపకంగా మారిస్తే అందులో యక్షుడు బాలమురళీకృష్ణ. ఇది ప్రసారమైనది విజయవాడ ఆకాశవాణి కేంద్రంలోనే." అడిగో రామయ్య... అమ్మ తలపై కురిపించడానికి ఆ ముత్యాల తలంబ్రాలు తీసుకున్నారు. అమ్మ సీతమ్మ ఓరకంట చూస్తూ సిగ్గుపడుతోంది"

"అదిగోనండి ఆ నీలమేఘశ్యాముని తండ్రి దశరథుని ఆనందం చూడండి. పెళ్లి బట్టల్లో మెరిసిపోతున్న ఆ సీతమ్మ తల్లిని పుత్రికా వాత్సల్యంతో చూస్తున్న ఆ జనకుడి ఆనందాన్ని చూడండి" అంటూ మన ఇంట రామ కల్యాణం జరుగుతున్నట్లుగా శ్రీరానవమినాడు ఉషశ్రీ భద్రాచల రామయ్య కల్యాణాన్ని కళ్లకు కట్టినట్టు చెప్పింది ఈ ఆకాశవాణిలోనే. బహుశా దేశంలోనే ఏ దేవుడి కల్యాణాన్ని రేడియోలో ఇలా లైవ్ కార్యక్రమంగా ఇచ్చింది మరే ఆకాశవాణి కేంద్రం కాదేమో...!? చివరకు మిగిలేది అంటూ నవల రాసి తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ మిగిలిపోయిన బుచ్చిబాబు, అమరావతి కథలు అందించిన సత్యం శంకరమంచి, అద్భుత గాయని శ్రీరంగం గోపాలరత్నం, మంచి భావకవి ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, ఇప్పటికీ తన సాహిత్యంతో అందరినీ పలకరించే సుధామ... వీళ్లంతా విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పని చేసిన వారే. అద్భుతమైన కథలు, మంచి నాటకాలు రేడియోలో ప్రసారం చేసేందుకు ఆయా రచయితల వెంటపడి ఆమోదముద్ర వేయించుకుని కొంతమందికే తెలిసిన గుంభన సాహితీవేత్త పన్నాల సుబ్రహ్మణ్యభట్టు జీవితమంతా ఆకాశవాణికే అంకితమైంది. రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావు, రేడియో అక్కయ్య కామేశ్వరమ్మ అందించిన బాల సాహిత్యం ఎలా మరవగలం. ముఖ్యంగా, పిల్లల్లో భయాన్ని పోగొట్టేందుకు ఆ దంపతులు తీసుకునే శ్రద్ధని వాళ్లతో పాటు పనిచేసిన వారే చెప్పాలి. ఇప్పుడంటే, టీవీ చానళ్లు ఆన్ చేయగానే సినిమాలు దండెత్తుతున్నాయి కాని, అప్పుడు రేడియోలో వచ్చే శబ్ద చిత్రాలు వినేందుకు ఇంటిల్లిపాది పకోడీలు, జంతికలు వేసుకున్న ప్లేట్లతో రేడియోల ముందే కూర్చునేవారు. గ్రామాల్లో బీదబిక్కి ఓ చోట చేరి వ్యవసాయ పనులతో పాటు ప్రపంచం గురించి విన్నది ఆ గ్రామ పంచాయితీ కార్యాలయాల నుంచి రేడియోల్లో వినిపించే తిరగేసిన గొడుగుల్లాంటి మైకుల నుంచే. వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లు ఇప్పుడు టీవీల్లో లైవ్ చూస్తున్నాం కాని, ఆనాటి రేడియోల్లో వచ్చే కామెంటరీ వింటే మన ఇంట్లోనే క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న ఆనందం కలిగేది. క్రికెట్ మ్యాచ్ వచ్చిందంటే పట్టణాల్లో అందరూ రేడియోలకు అతుక్కుపోయే వారు. ఇప్పుడంటే గ్రౌండ్‌కి వచ్చి మ్యాచ్ చూస్తున్న వారి సంఖ్య ఇన్ని లక్షలు అని చెబుతున్నారు కాని, రేడియోలో విన్న వారంతా కోట్ల సంఖ్యలోనే ఉండేవారు. అదీ రేడియో పవర్. ఇప్పట్లా టీవీ ఆన్ చేయగానే కార్యక్రమాలు వచ్చే రోజులు కావవి. రేడియో వినాలంటే ప్రభుత్వం ఇచ్చే లైసెన్స్ తప్పనిసరి. అరచేయి కంటే కాసింత పెద్దగా ఉండే ఓ పుస్తకంలో రేడియో లైసెన్స్‌ల కోసమే రూపొందించిన స్టాంపులు అతికించి మరీ ఇచ్చేవారు లైసెన్సులు. స్టాంప్ కలెక్షన్ హ్యాబీగా ఉన్నవారికి ఈ స్టాంపులు అక్కరకు వచ్చేవి కావు. ఇవి ప్రభుత్వం రేడియోల కోసమే ప్రత్యేకంగా ముద్రించిన స్టాంపులు. వృద్ధాప్యం సంతానం సాలెగూట్లో పురుగు అంటాడు ఓ కవి. రేడియో నేటి టెక్నాలజీ గూట్లో పట్టు పురుగు. పురుగు కనిపించదు. పట్టు మిగలకుండా పోదు.

(ఈ డిసెంబర్ 1 వ తేదీ నాటికి విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి 75 ఏళ్లు వచ్చిన సందర్భంగా)

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

ఉత్తమ కమ్యూనిస్టు కాంతారావు

వై. చెంచయ్య

పేద, బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి న్యాయవాద వృత్తిని జతపరచి విశేష కృషిచేసిన కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ, ప్రముఖ న్యాయవాది చేకూరి లక్ష్మీ కాంతారావు. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమం నుండి క్రియాశీలంగా పార్టీ కార్యకలాపాలలో పనిచేసిన సీనియర్ కమ్యూనిస్టు నాయకులు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, ప్రస్తుత జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ప్రముఖ సంపాదకులు అమరజీవి సి. రాఘవాచారి తదితర పార్టీ ముఖ్య నాయకులకు ఆయనంటే ఎంతో గౌరవభావం ఉండేది. చిన్న వయసులోనే కాంతారావు కమ్యూనిస్టు భావజాలంపట్ల ఆకర్షితులయ్యారు. మధిరలో హైస్కూలు విద్య నభ్యసించి, హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి డిగ్రీ పట్టభద్రులయ్యారు. మద్రాసులో న్యాయవాద విద్యనభ్యసించారు. వివాహానంతరం నరసరావుపేటలో న్యాయవాద వృత్తిని చేపట్టారు. నరసరావుపేటలో కమ్యూనిస్టు నాయకులు కీ.శే. పోపూరి బ్రహ్మానందంతో కలిసి విశాఖ ఉక్కు ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొని ఎన్నో దాడుల నెదుర్కొన్నారు.

1965లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పి) వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నికై తుదిశ్వాస వరకు కొనసాగారు. దాదాపు ఏడు దశాబ్దాలపాటు ప్రముఖ న్యాయవాదిగా శ్రమజీవులు, రైతులు, ఉద్యోగుల సమస్యలపై ప్రజా పోరాటాలలో, కోర్టులలో న్యాయ పోరాటంచేసి కాంతారావు అనేక విజయాలు సాధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసి ప్రజల కీలక కేసులను హైకోర్టు వరకు తీసుకెళ్లి పోరాడి విజయం సాధించారు. వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయించి, వారి జీవితాలలో కాంతారావు వెలుగులు నింపారు. నరసరావుపేటలో అనేక సంఘాలకు అధ్యక్షునిగా, గౌరవాధ్యక్షునిగా వారి సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. నరసరావుపేట పట్టణం, నియోజకవర్గంలో పేదలకు సాగుభూములు ఇళ్ల స్థలాల కోసం జరిగిన ఉద్యమాలకు అండగా ఉండి, అనేక కాలనీల ఏర్పాటుకు సహకరించి, వేలాది మందికి ఆశ్రయం కల్పించారు. గుంటూరు జిల్లా సీపీఐ సమితి సభ్యునిగా, జిల్లా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడిగా, ప్రజా ఉద్యమాలకు అండదండలందిస్తూ క్రియాశీలక పాత్ర పోషించారు. పల్నాడు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకేకాక వామపక్షాల శ్రేయోభిలాషులకు, ప్రజాసంఘాల నాయకులకు పెద్దదిక్కుగా కాంతారావు ఉండేవారు. ప్రజా ఆందోళనలకు అండగా ఒక న్యాయవాదిగా ఆయన ఎంతో తోడ్పడ్డారు. వినుకొండ సమీపంలో గణేశు నిపాలెంలోగల 500 ఎకరాల సీలింగు భూమిని న్యాయవాదిగా పేద సాగుదార్లకు దక్కేట్లు చేశారు. 1970-80వ దశకాలలో నరసరావుపేట ప్రాంతంలో ఉవ్వెత్తున సాగిన విద్యార్థి ఉద్యమాలకు కాంతారావు అండగా నిలిచారు. విద్యార్థులపై అక్రమంగా మోపిన ఎన్నో కేసులను ఎదుర్కొని విద్యార్థులకు అభిమానపాత్రులయ్యారు. దొంగ నిల్వల వెలికితీత ఉద్యమం, ఎరువుల బ్లాక్ మార్కెట్ బారి నుండి రైతులను కాపాడటంలోనూ 1973, 1974 ప్రాంతంలో నరసరావుపేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎరువుల ఆందోళనలో వందల లారీల ఎరువులు కంట్రోలు రేటుకి రైతుల కందించడంలో బ్రహ్మానందం, కాంతారావులు ప్రముఖపాత్ర వహించారు. సాగర్ జలాలు సక్రమంగా రైతులకు అందించడంలో జరిగిన వివిధ ఆందోళనలలో క్రియాశీల నాయకత్వం వహించారు. 1970-80 దశకాల్లో దేశ వ్యాపిత భూపోరాటాల పిలుపుమేరకు నరసరావుపేట ప్రాంతంలో ఉవ్వెత్తున సాగిన భూపోరాటాలకు కాంతారావు అందించిన న్యాయ సహాయం విశిష్టమైనది. 1978లో మొదలై ఇప్పటికీ కొన్ని కేసులు నడుస్తుండగా, భూములు మాత్రం పేదల సాగులోనే ఉన్నాయి. 1981లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన నరసరావుపేట మునిసిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆరుగురు సీపీఐ అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎస్.వి.రావు, డాక్టర్ ఎం రాధాకృష్ణమూర్తితోపాటు కాంతారావు ఎన్నికయ్యారు. పౌరహక్కుల పరిరక్షణకు, అశ్లీలత వ్యతిరేక ఉద్యమానికి అనేకసార్లు న్యాయ సహాయమందించారు. గుత్తికొండ బిలం కుట్రకేసు తదితర ఎన్నో కేసులలో ప్రముఖ న్యాయవాది ఎస్‌విఎల్ గారి మార్గదర్శకత్వంలో న్యాయవాదిగా రాణించారు. జస్టిస్ పిబిఎస్ చార్లెస్, సి.జె. ప్రతాప్, పి రాజారావు, మద్రి రాజశేఖర్, ఆర్ వెంకటేశ్వరరావు, చంద్ర ఆంజనేయులు, జివిఎస్ ప్రసాద్, గుంటూరు ఉపేంద్ర తదితరులెందరికో కాంతారావు ప్రోత్సాహం ఎంతో ఉండేది. కాంతారావు తన 93వ ఏట సంవత్సరం క్రితం మృతి చెందటం కుటుంబ సభ్యులతోపాటు పార్టీకి, పేద ప్రజలకు తీరనిలోటు. వారి ఆశయసాధనకు కంకణబద్ధులై ముందుకు సాగుదాం. ఎన్నో రంగాలలో ప్రముఖులైన ఎందరికో ఆయన ఆత్మీయ సలహాదారుగా, పెద్దదిక్కుగా ఆయన స్మృతులు ప్రజల మనసులో స్థిరంగా ఉంటాయి.

సీపీఐ పిలుపు మేరకు దేశవ్యాప్త పాదయాత్ర నర్సరావుపేట ప్రాంతంలో 1978లో ప్రారంభించిన సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు, గంగాధరరావు, పోపూరి లతో పాటు కాంతారావు.

(ప్రథమ సంవత్సర స్మృతి సమావేశం నర్సరావుపేటలో నేడు (డిసెంబర్ 2న) జరుగుతున్న సందర్భంగా)

రచయిత: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

మూడు రాష్ట్రాలకు మిచౌంగ్ ముప్పు

4న తీరం దాటనున్న తుపాను

న్యూఢిల్లీ: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడినట్టు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. ఏపీ సహా మూడు రాష్ట్రాలకు తుపాను ముప్పు ఉన్నట్లు చెప్పింది. తుపాను పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోందని, డిసెంబరు 2 నాటికి తుపానుగా మారుతుందని వెల్లడించింది. దీనికి మిచౌంగ్ అని నామకరణం చేశారు. ఇది ప్రస్తుతం పుదుచ్చేరికి తూర్పు-ఆగ్నేయంగా 790 కి.మీ., చెన్నైకి ఆగ్నేయంగా 800 కి.మీ., బాపట్లకు 990 కి.మీ., మచిలీపట్టణానికి ఆగ్నేయంగా 970 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. క్రమంగా బలపడి డిసెంబరు 2 రాత్రి తర్వాత తుపానుగా మారి...డిసెంబరు 4 సాయంత్రం దక్షిణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ఉత్తర తీరం చెన్నై, మచిలీపట్టణం మధ్య తీరం దాటుతుందని అంచనా వేసింది. దీని ప్రభావంతో డిసెంబరు 1న అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని చాలాచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. డిసెంబరు 2 నుంచి 4 వరకూ తమిళనాడు, పుదుచ్చేరిల్లోనూ కొన్నిచోట్ల సాధారణ వర్షాలు నమోదవుతాయని చెప్పింది. డిసెంబరు 3 నుంచి 5 వరకూ దక్షిణ కోస్తాలో చాలాచోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు, ఉత్తర కోస్తాలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాయలసీమలోనూ చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు చెప్పింది.

10, 12 తరగతి ఫలితాల్లో మార్కుల శాతం ప్రకటించం: బోర్డు

న్యూఢిల్లీ: పది, పన్నెండు తరగతుల పరీక్ష ఫలితాలకు సంబంధించి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కీలక ప్రకటన చేసింది. 10, 12 తరగతి పరీక్షల ఫలితాల్లో భాగంగా ఎటువంటి డివిజన్లు/డిస్టింక్షన్ ప్రకటించబోమని స్పష్టంచేసింది. మార్కుల శాతాన్ని సైతం వెల్లడించబోమని తెలిపింది. ప్రస్తుతం సీబీఎస్ఈ మార్కులు, పొజిషనల్ గ్రేడ్‌లు ఇస్తున్న విషయం తెలిసిందే. బోర్డు పరీక్షల్లో మార్కుల శాతాన్ని గణించే విధానం గురించి తెలియజేయాలని కొందరు విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై సీబీఎస్ఈ పైవిధంగా స్పందించింది. 'ఫలితాల్లో భాగంగా ఎటువంటి డివిజన్, డిస్టింక్షన్ లేదా మార్కుల శాతాన్ని ప్రకటించం. ఒకవేళ విద్యార్థి ఐదు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఎంచుకున్నట్లయితే... వాటిలో ఐదు ఉత్తమ సబ్జెక్టులను గుర్తించడంపై సంబంధిత ఇన్‌స్టిట్యూట్ లేదా నియామక సంస్థ నిర్ణయం తీసుకోవచ్చు' అని సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యమ్ భరద్వాజ్ తెలిపారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం లేదా వెల్లడించడం వంటివి బోర్డు చేయదని భరద్వాజ్ స్పష్టం చేశారు. ఉన్నత విద్య లేదా ఉద్యోగ సమయంలో ఒకవేళ మార్కుల శాతం అవసరమైతే ఆ ఇన్‌స్టిట్యూట్/నియామక సంస్థ వాటిని గణించుకోవచ్చన్నారు.

కాంగ్రెస్‌కు మంచి రోజులు

ఎగ్జిట్ పోల్స్‌పై సంజయ్ రౌత్

ముంబై: కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వచ్చాయని శివసేన (యూబీటీ), ఇండియా కూటమి నేత సంజయ్ రౌత్ అన్నారు. ఈ విషయం చెప్పడానికి ఏ ఎగ్జిట్ పోల్ అవసరం లేదన్నారు. ఐదు రాష్ట్రాల్లో పోలింగ్ గురువారంతో ముగిసింది. అనంతరం వెలువడిన అనేక సర్వే అంచనాలు తెలంగాణ, చత్తీస్‌గఢ్‌లో పరిస్థితి కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోరు ఉండనుందని అంచనా వేశాయి. మిజోరంలో ప్రాంతీయ పార్టీల మధ్యే పోరు ఉండనుందని తెలిపాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై సంజయ్ రౌత్ స్పందిస్తూ 'కాంగ్రెస్ గెలుపు అంటే అది ఇండియా కూటమి విజయం. నేను దాన్ని బలంగా నమ్ముతా. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో గెలుపొందితే విపక్షాల్లో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ అవతరిస్తుంది. దీనిని కూటమి విజయంగా చూడాలి. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున ఖర్గే నాయకత్వమే దీనంతటికీ కారణం' అని అన్నారు. మరోవైపు ప్రియాంక భర్త, వ్యాపారవేత్త రాబర్ట్‌వాద్రా సైతం ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై స్పందించారు. మధ్యప్రదేశ్‌లో మరోసారి కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తాను విశ్వసించనని, వాస్తవ ఫలితాలనే నమ్ముతానని చెప్పారు. గడిచిన కొన్ని నెలల్లో చాలా మందిని తాను వ్యక్తిగతంగా కలిశానని, అందరూ మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని (కమల్‌నాథ్ సర్కారును) కూలదోసిన బీజేపీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని రాబర్ట్ వాద్రా చెప్పారు.

నక్సలిజం నిర్మూలన దిశగా భారత్: అమిత్‌షా

హజారీబాగ్: భారతదేశం నక్సలిజాన్ని నిర్మూలించే దిశగా దూసుకుపోతోందని, ఈ యుద్ధంలో విజయం సాధించాలని నరేంద్ర మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం అన్నారు. ఇక్కడ బీఎస్ఎఫ్ 59వ వ్యవస్థాపక దినం సందర్భంగా జార్ఖండ్‌లోని 'మేరు' శిక్షణా శిబిరంలో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. 1965లో ఏర్పడ్డ ఈ దళం ప్రస్తుతం దాదాపు 2.65 లక్షల జవాన్లను కలిగి ఉంది. ప్రధానంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో 6,386 కి.మీల పొడవైన భారత సరిహద్దుల్లో ఈ దళాలు పహారా కాస్తుంటాయి. సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) జవాన్లను ఉద్దేశించి షా మాట్లాడుతూ... గత 10 ఏళ్లలో, నక్సల్స్ హింసాత్మక సంఘటనలు 52 శాతం తగ్గాయని...ఈ ఘటనల్లో మరణాలు 70 శాతం తగ్గాయని, ప్రభావిత జిల్లాల సంఖ్య 96 నుంచి 45కి తగ్గిందని షా చెప్పారు. అలాగే మావోయిస్టుల దాడులకు గురైన పోలీస్ స్టేషన్ల సంఖ్య 495 నుంచి 176కి తగ్గిందని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేయాలని తాము నిర్ణయించుకున్నామని హోంమంత్రి వెల్లడించారు. మావోయిస్టుల సాయుధ, హింసాత్మక ఉద్యమం నిర్మూలన దిశగా దేశం చేరువలో ఉందని అమిత్ షా తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా దళాలకు సంబంధించిన 199 కొత్త శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తమ పాలనలో మావోయిస్టుల తీవ్రవాదంతో పాటు జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం, ఈశాన్య ప్రాంతంలో తిరుగుబాట్లపై విజయం సాధించినట్లు చెప్పారు.

వీర జవాన్లతో.. పాక్, బంగ్లా సరిహద్దులు సురక్షితం

వచ్చే రెండేళ్లలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సంపూర్ణ భద్రత నెలకొంటుందని అమిత్ షా వెల్లడించారు. ఈ రెండు అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి మిగిలిపోయిన దాదాపు 60 కి.మీ మేర ఖాళీలను పూడ్చే పని జరుగుతోందన్నారు. తమ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో ఇరుదేశాల సరిహద్దుల్లో దాదాపు 560 కిలోమీటర్ల మేర కంచె వేసిందని, మిగిలిన దాదాపు 60 కి.మీలు పనులను వచ్చే రెండేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. 'సరిహద్దులు సురక్షితంగా లేకపోతే ఏ దేశం కూడా అభివృద్ధి చెందదు. అయితే, కేవలం కంచెలు మాత్రమే దేశాన్ని రక్షించవు.

మన వీర బీఎస్ఎఫ్ జవాన్లు ఈ పని చేస్తున్నారు' అని షా పేర్కొన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడల్లా... సరిహద్దు భద్రతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. సరిహద్దుల్లో వాణిజ్యంతోపాటు రైలు, రోడ్డు, జలమార్గాలు, టెలిఫోన్ కమ్యూనికేషన్ అనుసంధానతను బలోపేతం చేశామన్నారు. 452 కొత్త సరిహద్దు పోస్టులను, 510 పర్యవేక్షణ టవర్లను ఏర్పాటు చేశామని, 637 సరిహద్దు పోస్టులకు కరెంటు కనెక్షన్, 500 పోస్టులకు నీటి సదుపాయం కల్పించామని వివరించారు.

వివాదమే బీజేపీ 'అస్త్రం'

బీహార్‌లో పాఠశాల సెలవులపై దుష్ప్రచారం



పాట్నా: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై ఆశలు సన్నగిల్లడం, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు అవకాశాలు లేవన్న సంకేతంతో బీజేపీ ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేస్తోంది. వివాదాలు గెలుపు అస్త్రాలుగా భావిస్తోంది. అందులో భాగంగా బీజేపీ యేతర రాష్ట్రాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. తాజాగా బీహార్‌లో పాఠశాల సెలవులను అస్త్రంగా మార్చుకుంది. బీజేపీతో తెగతెంపులు చేసుకున్న జనతాదళ్ (యునైటెడ్) అధ్యక్షుడు నితీశ్‌కుమార్, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ)తో జట్టు కట్టిన విషయం విదితమే. దీంతో నితీశ్ కుమార్ లక్ష్యంగా బీజేపీ ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. రెండు రోజుల క్రింత బీహార్ విద్యాశాఖ 2024కు సంబంధించిన పాఠశాలల సెలవుల జాబితా విడుదల చేసింది. ఈ సెలవులపై వార్తాపత్రికలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలోనూ తప్పుడు కథనాలు ప్రచారమయ్యాయి. పాఠశాలలకు ప్రకటించిన సెలవుల్లో హిందూ పండుగలు రద్దు చేశారన్న తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు సీఎం నితీశ్‌కుమార్‌ను ట్రోల్ చేయడం ప్రారంభించాయి. అనేకమంది సీనియర్ బీజేపీ నేతలు ఈ నకిలీ వార్తలకు విస్తృత ప్రచారం కల్పించారు. దీంతో టీవీ, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఈ అంశంపై చర్చలు జరిగాయి. చివరికి హిందూ వర్గం కూడా ఈ వార్తలపై ఆగ్రహం కలిగి ఉందని సామాజిక మాధ్యమాల్లో హోరెత్తించింది.

కాగా, యేటా రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలలకు సెలవుల జాబితా విడుదల చేస్తుంటాయి. వేర్వేరు పాఠశాలల కోసం వేర్వేరు క్యాలెండర్‌లు జారీ చేస్తాయి. మదర్సా, మక్తాబ్‌లకు వేర్వేరు సెలవుల జాబితా ఉంటుంది. మదర్సా, మక్తాబ్ సెలవుల జాబితాను మాత్రమే ఎంచుకుని... అన్ని విద్యాసంస్థలకు ఈ సెలవులనే జారీ చేశారంటూ సోషల్‌మీడియా, వార్తాపత్రికలు నకిలీ సమాచారాన్ని వ్యాప్తి చేశాయి. ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వంలోని ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ ఆదివారానికి బదులుగా శుక్రవారాన్ని సెలవుదినంగా ప్రకటిస్తుంది. నితీశ్‌కుమార్-తేజస్వీయాదవ్ ప్రభుత్వం వేసవి సెలవులను 20 నుండి 30 రోజులకు పొడిగించింది. ఆ సమయంలో వచ్చే హిందూ పండుగలకు ప్రత్యేకంగా సెలవులు పేర్కొనలేదు. దీంతో ఉద్దేశపూర్వకంగా విద్వేషపూరిత ప్రచారాన్ని వ్యాప్తి చేసేందుకు బీజేపీ ఈ జాబితాను అస్త్రంగా వాడుకుంది.

నితీశ్‌కుమార్ ప్రభుత్వం ముస్లింలకు మాత్రమే ఐటీ పార్క్, మతపరమైన రిజర్వేషన్లు కల్పిస్తోంది. షాదీ షగున్ పథకం, వక్ఫ్ సంస్థలకు వడ్డీలేని రుణాలు, హజ్‌యాత్రకు సబ్సిడీ, మౌల్వీలకు జీతాలు, ముస్లిం విద్యార్థులకు ఉచిత యూపీఎస్‌ఈ కోచింగ్ ఇస్తోంది. జన్మాష్టమి, రక్షా బంధన్, శివరాత్రి పండుగలకు సెలవులు ఇవ్వకుండా ముస్లిం పండుగైన ఈద్‌కు ఒక్కరోజు బదులు మూడు రోజులు సెలవులు ప్రకటించిందని బీజేపీ ఆరోపించింది.

మహిళల్లో సగం మంది సీఎం అభ్యర్థులు

ప్రోత్సహిద్దాం: రాహుల్‌గాంధీ

కొచ్చి: కాంగ్రెస్ పార్టీ తన సంస్థాగత నిర్మాణంలో మహిళా నేతలను చురుగ్గా ప్రోత్సహించాలని, వచ్చే పదేళ్లలో 50 శాతం మంది మహిళలు ముఖ్యమంత్రులు కావాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ కేరళ మహిళా కాంగ్రెస్ సమావేశం 'ఉత్సాహ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కావడానికి అవసరమైన లక్షణాలు కలిగి ఉన్న అనేక మంది మహిళా నాయకులు కాంగ్రెస్ ఉన్నారన్నారు. 'ఇంతకుముందు, మనం ప్రయత్నించి సాధించడానికి మంచి లక్ష్యం ఏమిటనేదానిపై నేను చర్చించాను. ఈ రోజు నుండి 10 సంవత్సరాలలో మన ముఖ్యమంత్రులలో 50 శాతం మంది మహిళలే ఉండేలా చేయడం కాంగ్రెస్ పార్టీకి మంచి లక్ష్యం అని నేను అనుకున్నాను. ఇప్పటికిప్పుడు మనకు ఒక్క మహిళా ముఖ్యమంత్రి కూడా లేరు. కానీ కాంగ్రెస్ పార్టీలో చాలా మంది మహిళలు చాలా మంచి ముఖ్యమంత్రులుగా ఉండగలరని నాకు తెలుసు' అని రాహుల్ అన్నారు. బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు. దానిని పూర్తిగా పురుషాధిపత్య సంస్థగా పేర్కొన్నారు. 'మహిళలు అనేక విధాలుగా పురుషుల కంటే గొప్పవారని నేను భావిస్తున్నాను. పురుషుల కంటే వీరికి ఓపిక ఎక్కువ. వారు పురుషుల కంటే ఎక్కువ కాలం దృష్టిని కలిగి ఉంటారు. పురుషుల కంటే ఎక్కువ సున్నితత్వం, దయగలవారు. మహిళలు అధికార నిర్మాణంలో భాగం కావాలి అని మనం విశ్వసిస్తాము కానీ మహిళలను చేర్చుకోవడం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో భాగం కాదు' అని రాహుల్ పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదం పొందినప్పటికీ కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దానిని అమలు చేయకుండా పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు ఉద్దేశించిన ఈ బిల్లు సెప్టెంబర్‌లో పార్లమెంటు ఆమోదం పొందింది. పార్లమెంటులో ఒకసారి ఆమోదించబడిన ఏ బిల్లు దశాబ్దం తర్వాత అమలు చేయడాన్ని తానెక్కడా చూడలేదన్నారు. సరిగ్గా దుస్తులు ధరించి ఉంటే బాలికపై అత్యాచారం జరిగేది కాదన్న కొందరు మితవాద నాయకుల వ్యాఖ్యలను కూడా రాహుల్ ప్రస్తావించారు. 'ఇది దేశంలోని ప్రతి ఒక్క మహిళను అవమానించడమే. బాధితురాలినే విలన్‌గా మారుస్తోంది. ఇదే మనకు ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఉన్న తేడా' అని రాహుల్ అన్నారు.

కర్నాటకలో ముస్లిం వృద్ధుడిపై దాడి

జై శ్రీరామ్ అనాలంటూ వేధింపులు : ఎఫ్ఐఆర్ నమోదు

హుబ్బాళి: కర్నాటకలో హిందూత్వ మూక రెచ్చిపోయింది. ముస్లిం వృద్ధుడిని తీవ్రంగా వేధించింది. జై శ్రీరామ్ అనాలని బలవంత పెట్టడమే కాకుండా బీర్ సీసా పగులగొట్టి, గాజు ముక్కతో అతనికి గడ్డం గీయాలని ఇద్దరు దుండగులు యత్నించారు. అది కుదరకపోవడంతో గడ్డానికి నిప్పు పెట్టాలని చూశారు. ఈ దాడిలో తాను చచ్చిపోతానని భయపడినట్లు 65ఏళ్ల బాధితుడు వాపోయారు. ఈ ఘటన కొప్పం జిల్లా గంగావటి పట్టణంలో జరిగింది. బాధితుడు హుస్సేన్‌సాహెబ్ ఫిర్యాదుతో నవంబరు 30న గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. నవంబరు 25వ తేదీ రాత్రి హోసాపేట నుంచి గంగావతికి వచ్చిన బాధితుడు ఆటో కోసం వేచివున్నప్పుడు అటుగా వచ్చిన ఇద్దరు బైకర్లు లిఫ్ట్ ఇచ్చే నెపంతో హుసేన్‌సాహెబ్‌ని బైకుపై ఎక్కించుకొన్నారు. బైక్ నడుపుతూ ఆయనను కొట్టడం మొదలు పెట్టారు. దుర్భాషలాడారు. పంపానగర్ ప్రాంతానికి తీసుకెళ్లి బైకుపై నుంచి కిందకు నెట్టివేసి భౌతిక దాడికి దిగారు. కళ్లు సరిగ్గా కనిపించవని, ఇంటికి వెళ్లిపోతాను వదిలేయమని ప్రాధేయ పడగా జై శ్రీరామ్ అని నినాదాలు చేయాలని బలవంత పెట్టారు. చెప్పింది చేసినాగానీ దాడి ఆపలేదు అని హుస్సేన్ సాహెబ్ వాపోయారు. తన రోదన విని అక్కడే నిద్రిస్తున్న కొందరు గొర్రెల కాపరులు వచ్చి కాపాడారని చెప్పారు. హుస్సేన్‌సాహెబ్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు కావడంతో నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. సమీప బస్టాండ్, ప్రధాన రహదారులు, పంపానగర్ ప్రాంతాల సీసీటీవీ ఫుటేజిని పరిశీలిస్తున్నారు. నిందితులపై చర్యలకు సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) సభ్యులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా గంగావతిలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు పూనుకున్నారు.

ఆటలు... నడకతో సమయం గడిపాం

సొరంగం నుంచి బయటపడిన కార్మికుడి వెల్లడి

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగంలో చిక్కుకున్నప్పుడు తాము సమయం ఏ విధంగా గడిపిందీ కార్మికులు ఒక్కొక్కరుగా వెల్లడిస్తున్నారు. కుప్పకూలిన ఆ సొరంగం నుంచి రెండు వారాల తర్వాత 41 మంది సురక్షితంగా బయటకు వచ్చారు. సొరంగంలో చిక్కుకున్నప్పుడు రెండు వారాల పాటు చిన్ననాటి ఆటలు ఆడటం, నడక ద్వారా సమయం గడిపామని కార్మికుడు ఒకరు శుక్రవారం ఆంగ్ల వార్తా ఛానెల్‌కు తెలిపాడు. ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్తి జిల్లాలోని మోతీపూర్ నివాసి అయిన అంకిత్, కూలిపోయిన సొరంగంలో తాను గడిపిన 17 రోజుల గురించి మాట్లాడాడు. దానిని 'చావుకు దగ్గరగా ఉన్న అనుభవం' అని పేర్కొన్నాడు. 'మా కుటుంబ సభ్యులతో మాట్లాడలేకవడంతో ఆందోళన చెందాను. వాళ్లు బాగున్నారా అని ఆలోచిస్తూనే ఉన్నాను. సొరంగం చాలా పొడవుగా ఉన్నందున మేము సమయం గడపడానికి లోపలికి నడిచాము. అలాగే, రాజా, మంత్రి, చోర్, సిపాహి వంటి చిన్ననాటి ఆటలను ఆడేవాళ్లం' అని అంకిత్ వివరించాడు. తాము పెన్, డైరీని ఉపయోగించి కార్డ్ గేమ్ కూడా తయారు చేశామన్నాడు. ఉష్ణోగ్రత గురించి అడిగితే సొరంగం లోపల చలి అంతగా లేదని, తామంతా జియోటెక్స్‌టైల్స్‌పై నిద్రించామని, అవి మౌలిక సదుపాయాల పనులకు ఉపయోగించే సింథటిక్ వస్త్రమని చెప్పాడు. 'మేము నిద్రపోయేటప్పుడు జియోటెక్స్‌టైల్స్‌ను దుప్పట్లుగా కూడా ఉపయోగించాము' అని అంకిత్ చెప్పాడు. మంగళవారం కార్మికులను రక్షించిన తర్వాత, కూలిపోయిన సొరంగంలో వారు గడిపిన 17 రోజుల చిత్రాలు, వీడియోలను ఈ వార్తా ఛానెల్ ప్రసారం చేసింది. వీడియోలు వారు తినే దానికంటే ఎక్కువ పండ్లు, ప్లాస్టిక్ సీసాలు కనిపించాయి. వీటిని పైపు ద్వారా సొరంగంలోకి నెట్టారు. చిక్కుకున్న కార్మికులకు డ్రై ఫ్రూట్స్, వేడి కిచిడీని అందించడానికి సీసాలు ఉపయోగించారు. కార్మికులు రోటీ, కూరగాయలు, బియ్యంతో సహా భోజనం, రొట్టె తినడం, పాలను తాగడం వంటివి ఆ దృశ్యాల్లో కనిపించింది.

కార్మికులు సెల్ఫీలు తీసుకున్నట్లు దృశ్యాలు కూడా ఉన్నాయి. నవంబరు 12న సొరంగం ఒక భాగం కూలిపోవడంతో 41 మంది కార్మికులు చిక్కుకున్నారు. 'ర్యాట్ హోల్' విధానంలో ఒక రంధ్రం తవ్వడం ద్వారా ఫలించిన బహుళ సంస్థల సహాయ ఆపరేషన్ తర్వాత నవంబరు 28న చక్రాలు అమర్చిన స్ట్రెచర్లపై 57 మీటర్ల స్టీల్ పైపును ఉపయోగించి కార్మికులను బయటకు తీసుకువచ్చారు.

ఐదేళ్లలో 20 సార్లు కూలిన సొరంగం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో నవంబరు 12న నిర్మాణంలో ఉన్న సిల్క్యారా-బార్‌కోట్ సొరంగం కూలిపోయి అందులో చిక్కుకున్న 41 మంది కార్మికులను అనేక ప్రయత్నాలు చేసి చివరకు 17 రోజులు తర్వాత సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అయితే, ఈ సొరంగం కూలిపోవడం ఇదే మొదటిసారి కాదని, ఐదేళ్లలో 20సార్లు పాక్షికంగా కూలిపోయిందని అధికారులు తెలిపారు. చార్‌ధామ్ మార్గంలో అతిపెద్దదైన ఈ సొరంగం పొడవు 4.5 కిలోమీటర్లు. జాతీయ రహదారుల ప్రాతిపదిక సదుపాయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ డైరెక్టర్ (అడ్మిన్ అండ్ ఫైనాన్స్) అన్షత్ మనీశ్ మాట్లాడుతూ నిర్మాణ పనులు జరుగుతున్న ఈ సొరంగం పాక్షికం నుంచి మధ్యస్థంగా 19 నుంచి 20 సార్లు కూలిపోయిందని అన్నారు. ఈ ప్రాంతంలో భూమి స్వభావం వల్లే ఇలా జరుగుతుందని చెప్పారు. ఏ సొరంగం నిర్మాణంలో అయినా ఇలాగే జరుగుతుందని, కానీ, ఈసారి దురదృష్టవశాత్తూ కార్మికులు శిథిలాల్లో చిక్కుకున్నారని మనీశ్ తెలిపారు. సొరంగం సిల్క్యారా వైపు కంటే బార్కోట్ వైపు ఎక్కువ కూలిపోయిందని చెప్పారు. సిల్క్యారా చివర నుంచి సొరంగం ముఖద్వారం లోపల 160- 260 మీటర్ల ప్రాంతాన్ని 'రెడ్ జోన్' లేదా పెళుసుగా ఉండే రాళ్లను కలిగి ఉన్న 'షీర్ జోన్'గా గుర్తించామని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాన్ని బలోపేతం చేయడానికి అదనపు రక్షణ చర్యలు తీసుకుంటామని మనీశ్ చెప్పారు. సొరంగం నిర్మాణంతో సంబంధం ఉన్న మరొక అధికారి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూమి స్వభావం, రాళ్ల వైషమ్యం సొరంగం చాలాసార్లు కూలిపోవడానికి కారణమని వివరించారు. ఈ సొరంగం డిజైన్‌లో నవయుగ ఇంజినీరింగ్ సంస్థకు ఐరోపాకు చెందిన ప్రముఖ కంపెనీ బెర్నార్డ్ గ్రుప్పే సహకరించింది.

వాతావరణ మార్పుపై

ఆర్థిక సాయం, సాంకేతిక బదిలీ అవశ్యం

ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాతావరణ ఆర్థిక సాయం, సాంకేతిక బదిలీ ఆవశ్యకతను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు. వాతావరణ కార్యాచరణపై పెరుగుతున్న ఆశయాలు వాతావరణ ఆర్థిక సాయంపై పురోగతికి సరిపోలేలా చూడాలన్నారు. వాతావరణ సమస్యను వారు సృష్టించలేదని, అయితే, ఇప్పటికీ పరిష్కారంలో భాగం కావడానికి వారు సిద్ధంగా ఉన్నారన్న విషయాన్ని తప్పనిసరిగా గుర్తించాలన్నారు. కాప్-28 సమావేశానికి హాజరయ్యేందుకు దుబాయ్‌లో మోదీ మాట్లాడుతూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు (యూఏఈ) చెందిన అలెటిహాద్ వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ వాతావరణ మార్పు అనేది ఏకీకృత ప్రపంచ ప్రతిస్పందనను కోరే సమష్టి సవాలు అని తాను ఎల్లప్పుడూ చెబుతానని అన్నారు. ఈ సమావేశం సమర్థవంతమైన వాతావరణ చర్యలకు సరికొత్త ఊపును ఇస్తుందని భారత్ ఆశాభావంతో ఉందని ఆయన తెలిపారు. వాతావరణ మార్పుపై ఐక్యరాజ్య సమితి ముసాయిదా సమావేశం (యూఎన్ఎఫ్‌సీసీసీ) లక్ష్యాలు, పారిస్ ఒప్పందం లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో సమర్థవంతమైన వాతావరణ చర్య, అంతర్జాతీయ సహకారానికి కాప్-28 తాజా ప్రేరణనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారతదేశం, యూఏఈ హరిత, మరింత సంపన్నమైన భవిష్యత్తును రూపొందించడంలో భాగస్వాములుగా ఉన్నాయి. అలాగే, వాతావరణ చర్యపై ప్రపంచ చర్చను ప్రభావితం చేయడానికి మా ఉమ్మడి ప్రయత్నాలలో మేము స్థిరంగా ఉన్నాము' అని ఆయన చెప్పారు. భారత్-యూఏఈ సంబంధాలపై మాట్లాడుతూ వాతావరణ చర్యలో తమ భాగస్వామ్యం భవిష్యత్తు దృష్టితో నడిచే శక్తి నుంచి బలానికి వెళుతోందన్నారు. భారతదేశం, యూఏఈ బలమైన, శాశ్వతమైన సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. ఇంధన భద్రతను పెంపొందించడానికి, ఇంధన రంగంలో ఒకరి బలాన్ని మరొకరు పెంచుకోవడానికి, అంతర్జాతీయ సౌర సదుపాయాల మద్దతును అందించడానికి ఉమ్మడి గ్రిడ్‌ను ఏర్పాటు చేయడంలో చేరవచ్చని ఆయన చెప్పారు. వాతావరణ మార్పుల ప్రపంచ సవాలును పరిష్కరించడంలో రెండు దేశాలు చురుకుగా సహకరించుకుంటున్నాయన్నారు. 'నా దృష్టిలో రాబోయే సంవత్సరాల్లో ఈ భాగస్వామ్యం కీలకమైన పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదు' అని తెలిపారు. 2014లో ప్రధాని అయిన తర్వాత మోదీ యూఏఈలో పర్యటించడం ఇది ఆరవసారి.

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం

8 మంది దుర్మరణం

కటక్: ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్కును వేగంగా దూసుకొచ్చిన వ్యాన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఇందులో ఎనిమిది మంది మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కెందుజార్‌లో శుక్రవారం ఉదయం 5 గంటలకు 20వ నంబర్ జాతీయ రహదారి బలిజోడి సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గంజాం జిల్లాకు చెందిన రెండు కుటుంబాల సభ్యులు వ్యాన్‌లో తారిణి దేవి ఆలయ దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఆగివున్న ట్రక్కును వ్యాన్ వేగంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే 8మంది మృతి చెందారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. గాయపడిన 12 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని కటక్ ఆసుపత్రికి తరలించారు.

పోరాట యోధుడు జీవీ కృష్ణారావు

వర్ధంతి సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఓబులేసు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: శ్రామికవర్గ అభ్యున్నతి, కార్మికవర్గ భవిష్యత్తు, కమ్యూనిస్టు పార్టీ బలోపేతం, దళిత, బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కోసం జీవీ కృష్ణారావు అలుపెరుగని పోరాటం చేశారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. కృష్ణారావు ఉద్యమాలు స్ఫూర్తిదాయకమైనవన్నారు. గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ నగర సమితి, ఏఐటీయూసీ నగర సమితి, జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ అధ్వర్యంలో కృష్ణారావు ఏడవ వర్ధంతి సభ సంగడిగుంటలోని రేగుల రాఘవయ్య భవన్ వద్ద శుక్రవారం నిర్వహించారు. కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీపీఐ పతాకాన్ని ముప్పాళ్ల నాగేశ్వరరావు ఎగురవేశారు. హమాలీ(ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణారావు ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని అన్నారు. ఆయన కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులై విద్యార్థి నాయకుడయ్యారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పటికి నమ్మిన సిద్ధాంతం కోసం పాటుపడ్డారని, పార్టీ కోరగా ఉద్యోగాన్ని వీడి ఉద్యమమే ఊపరిగా తుదిశ్వాస వరకు పనిచేశారని తెలిపారు. శ్రామికవర్గ విముక్తి కోసం శ్రమించారన్నారు. దేశంలో కక్ష సాధింపు, బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు నడుస్తున్నాయని, కార్మిక వర్గానికి, రైతాంగానికి, సామాన్య ప్రజలకు ప్రతికూలంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పాలకులు ఉన్నారని ముప్పాళ్ల విమర్శించారు. ఈ నేపథ్యంలో జీవీకృష్ణారావు బాట అనుసరణీమన్నారు. మూడోసారి అధకారం కోసం మోదీ కుటిలయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇతర పార్టీ నేతలను లొంగదీసుకునే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని, లొంగని వారిపై ఈడీ, సీబీఐతో దాడులు చేయిస్తూ ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. జీవీ కృష్ణారావు ఉద్యమ స్ఫూర్తితో కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జి.ఓబులేసు మాట్లాడుతూ మల్లయ్యలింగం తరువాత అనేక కార్మిక సంఘాల నిర్మాణంలో జీవీ కృష్ణారావు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అసంఘటిత రంగ కార్మికుల మదిలో చిరస్థాయిగా నిలబడిన నేతగా కొనియాడారు. జీవీ కృష్ణారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న ధనస్వామిక వ్యవస్థలో ఓట్లు కూడా అంగడి సరుకయ్యాయని, ఈ దశలో కార్మిక ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే కృష్ణారావుకు నిజమైన నివాళి అని ఓబులేసు అన్నారు.

మానం ఆంజనేయులకు జీవీకే విశిష్ట సేవా పురస్కారం

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, ది విశాఖపట్టణం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులును జీవీకే విశిష్ట సేవా పురస్కారంతో సన్మానించారు. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడం బిగించాలని, ప్రజా సమీకరణల ద్వారా పార్టీని బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఠా కార్మిక సంఘం నాయకులు, బ్యాంకు సిబ్బంది ఆయనకు శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

తొలుత ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు సభికులను వేదికపైకి ఆహ్వానించారు. నగర ప్రధాన కార్యదర్శి ఆకటి అరుణ్ కుమార్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, హమాలీ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర గౌరవాధ్యక్షులు జి.సురేశ్ బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ది విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ కోటేశ్వరరావు, ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకుడు పులి సాంబశివరావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా కార్యదర్శి కోలా స్వాతి, నగర కార్యదర్శి లక్ష్మి, జీవీకే ట్రస్ట్ కన్వీనర్ అమ్మిశెట్టి శివ, బోయపాటి శ్రీకాంత్, సుధాకర్, జీవీ కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో క్రీడా సంబరం

మంత్రి ఆర్‌కే రోజా

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమే 'ఆడుదాం ఆంధ్రా' అని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా చెప్పారు. విజయవాడ బందర్ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన మీడియా సమావేశంలో క్రీడా ప్రాధికారసంస్థ (శాప్) చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, క్రీడాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, వైస్ చైర్మన్- మేనేజింగ్ డైరెక్టర్ ధ్యాన్‌చంద్రతో కలిసి 'ఆడుదాం ఆంధ్రా'కు సంబంధించిన కిట్‌ను, వీడియోను, కార్యక్రమ వివరాలను తెలిపే బ్రోచర్‌ను మంత్రి రోజా ఆవిష్కరించారు. మంత్రి రోజా 'కదిలి ముందుకురా ఆడుదాం ఆంధ్రా' అనే పాట పల్లవిని స్వయంగా పాడారు. మంత్రి రోజా మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా అందరి ఆట అని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఆటల ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో వంటి ఎంపిక చేసిన 5 క్రీడాంశాలు గ్రామ/వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 3 వరకు 2024 వరకు కొనసాగుతాయన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు కార్యరూపం కల్పించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. దాదాపు రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో ఆడుదాం ఆంధ్రా నిర్వహిస్తున్నామన్నారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలతో, విప్లవాత్మక చర్యలతో ప్రజల ముంగిటకు వెళ్లడం, ప్రజల మన్ననలు పొందడం జగన్‌మోహన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో జరిగే అతి పెద్ద క్రీడా సంబురమే ఆడుదాం ఆంధ్రా అని ఆయన అభివర్ణించారు. ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై జిల్లా ముఖ్య శిక్షకులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు, వలంటీర్లకు శాప్ అధికారులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించి శిక్షణనిస్తున్నామన్నారు. ఇప్పటికే శాప్ లీగ్స్, జగనన్న క్రీడా సంబురాలు, సీఎం కప్, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించామన్నారు. ప్రతిభా వంతులైన క్రీడాకారులకు అందించే ఆర్థిక సాయం గత బకాయిలతో సహా చెల్లించినట్లు చెప్పారు. క్రీడాశాఖ ద్వారా ఇప్పటికే 2400కు పైగా ఉద్యోగాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. మంత్రి రోజా చొరవతో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా భవిష్యత్‌లో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాళ్లతో క్రికెట్‌లో శిక్షణ అందిస్తామన్నారు.

ఫాసిస్టు పాలనకు అంతం పలకాలి

- 'ఉపా' అక్రమ కేసులను ఉపసంహరించాలి
- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఫాసిస్టు పాలనకు అంతం పలకాని, 'ఉపా' కేసులను ఉపసంహరించు కోవాలని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. కేంద్రంలో మతతత్వ, కార్పొరేట్, ఫాసిస్టు పాలనకు అంతం పలికేందుకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ సహా దానికి మద్దతుగా ఉన్న పార్టీలను ఓడించాలని పిలుపునిస్తూ 'భారత్ బచావో' పేరుతో చేపట్టిన ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకొని అక్రమ కేసులు బనాయించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత్ బచావో నాయకులు డాక్టర్ గోపీనాథ్, గాదె ఇన్నయ్యపై తెలంగాణకు చెందిన ఎల్లారెడ్డిపేట పోలీసులు బనాయించిన కుట్ర కేసును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం భారత్ బచావో ఆంధ్ర ప్రదేశ్ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ప్రధాన వక్తగా విచ్చేసిన జల్లి విల్సన్ మాట్లాడుతూ పదేళ్ల కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. నిరుద్యోగం తారస్థాయికి చేరిందని, అధిక ధరలు సామాన్యులకు తీవ్ర భారంగా మారాయని అన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ఆదివాసీలపై, ప్రజాసంఘాల కార్యకర్తలపై 'ఉపా' కేసులు మోపుతున్నారని, రాజకీయ పార్టీలు ఏదైనా నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తే ముందస్తు అరెస్టు చేస్తున్నారన్నారు. 'ఉపా' కేసు రాజ్యాంగ విరుద్ధమని, దీనిలో అరెస్టు చేస్తే ఆరు నెలల పాటు బెయిల్ రాదని, ఇలాంటి చట్టాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పాలకులు ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేయాలనేగానీ ప్రజా సమస్యలను ఎత్తి చూపే వారిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం శోచనీమన్నారు. దేశవ్యాప్తంగా నమోదు చేసిన ఉపా కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

భారత్ బచావో అఖిల భారత వైస్ చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ మతతత్వ, కార్పొరేట్, ఫాసిస్టు పాలకులను గద్దె దింపి, అంబేద్కర్ రాజ్యాంగం హామీ ఇచ్చిన లౌకక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చైర్మన్ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, వైస్ చైర్మన్‌గా తాను, ఆర్గనైజింగ్ సెక్రటరి గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్, ప్రొఫెసర్ హరగోపాల్, సీమాఅజాద్, సి.భాస్కరరావు తదితరుల నాయకత్వంలో 'భారత్ బచావో' పేరుతో దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. బీజేపీతో కుమ్మక్కవుతున్న పార్టీలను కూడా ఎన్నికల్లో ఓడించడానికి కృషి చేయాలని భారత్ బచావో నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణాలో 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ రాష్ట్రంలో నిరంకుశ అవినీతి పాలన సాగిస్తూ, పార్లమెంటు బీజేపీకి పూర్తిగా సహకరిస్తుండటం వల్ల తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని భారత్ బచావో తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. దానికి తమపై కక్ష కట్టి బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పోలీసులు వారిని, ఎన్నికలను బహిష్కరిస్తున్న మావోయిస్టులతో సంబంధాలు అంటగట్టి 'ఉపా' కుట్ర కేసు పెట్టారని విమర్శించారు. ఇది రాజ్యాంగ అధికరణ 19 పౌరులకు గ్యారెంటీ చేసిన భావప్రకటనా స్వేచ్ఛపై తీవ్రమైన దొంగ దాడి అని తెలిపారు. ఏ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడినా ఆ ప్రభుత్వం ప్రజా తిరస్కారానికి గురికావడం తథ్యమని హెచ్చరించారు. భారత్ బచావో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి భాస్కరరావు మాట్లాడుతూ ఫాసిస్టు పాలనను అంతమొందించాలని పిలుపునిస్తూ భారత్ బచావో పేరుతో చేపట్టిన ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకొని అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ అవినీతి పాలన సాగిస్తూ పార్లమెంటులో బీజేపీకి పూర్తిగా సహకరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడ దేసిందని విమర్శించారు. భారత్ బచావో తెలంగాణ నాయకులపై అక్రమ కేసులు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఈ అక్రమ కేసులను సమీక్షించి, వాటిని రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా భారత్ బచావో నాయకులను బీజేపీకి మద్దతు పలుకుతున్న వైసీపీ ప్రభుత్వం అరెస్టులు చేయించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ కేసులకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని ఉధృతం చేస్తా మన్నారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, ఎంసీపీ ఐయూ రాష్ట్ర కార్యదర్శి కాటం నాగ భూషణం, సుభాన్, చావలి సుధాకర్, అరసపల్లి కృష్ణ, ఆంజనే యులు, కొండారెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో భారీగా జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: దేశంలో జీఎస్టీ వసూళ్లు భారీగా నమోదయ్యాయి. నవంబరులో రూ.1,67,929 కోట్లు వసూలయ్యాయి. 2023-24లో జీఎస్టీ వసూళ్లు రూ.1.60 లక్షల కోట్ల మార్కును దాటడం ఇది ఆరోసారి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 15 శాతం పెరిగాయి. తాజా వసూళ్లలో సీజీఎస్టీ వాటా రూ.30,420 కోట్లు కాగా ఎస్‌జీఎస్టీ వాటా రూ.38,226 కోట్లుగా ఉంది. ఐజీఎస్టీగా రూ87,009 కోట్లు, సెస్సుల రూపంలో రూ.12,274 కోట్లు వచ్చి నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. ఐజీఎస్టీ రూపంలో వచ్చిన వసూళ్లను రూ.37,878 కోట్లు, సీజీఎస్టీకి, రూ.31,557 కోట్లు ఎస్‌జీఎస్టీ కింద సర్దుబాటు చేసింది. ఇదిలావుంటే, మహారాష్ట్ర రూ.25,585 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో రూ4,093 కోట్లు వసూలయ్యాయి. గతేడాది రూ.3,134 కోట్లతో పోలిస్తే ఇది 31 శాతం అధి కం. తెలంగా ణలో గతేడాది రూ4,228 కోట్లు వస్తే ఈసారి 18 శాతం వృద్ధితో రూ4,986 కోట్లు వచ్చాయి.

గడువులోగా నాడు-నేడు పనులు

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- పాఠశాలలు తెరిచేలోగా విద్యాకానుక
- అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం
- క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నాడు-నేడు రెండో దశ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. నాడు-నేడు తొలిదశలో పూర్తయిన స్కూళ్ల నిర్వహణపై, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. విద్యాశాఖలో చేపడుతున్న మనబడి నాడు-నేడుతో పాటు, వివిధ కార్యక్రమాల అమలు ప్రగతిపై సీఎం జగన్ శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సీఎంకు పథకం పురోగతి వివరాలను అధికారులు తెలియజేస్తూ, ఈ ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ 21 నుంచి ట్యాబులు పంపిణీ చేస్తామన్నారు. అన్ని ట్యాబుల్లో పిల్లల సందేహాలను తీర్చే యాప్‌లను ఇన్‌స్టాల్ చేశామని, టీచర్లకూ ట్యాబులు పంపిణీ చేయడం ద్వారా బోధనలో మంచి మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. గతేడాది ట్యాబులు పొందిన టీచర్లు సగటున ప్రతి రోజూ 77 నిమిషాలు, ట్యాబులు అందుకున్న విద్యార్థులు సగటున 67 నిమిషాల పాటు పాఠ్యాంశాలను నేర్చుకునేందుకు వాటిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. కిందపడో మరే ఇతర కారణాల వల్లో దెబ్బతిన్న దాదాపు ఏడువేల ట్యాబులను సీఎం ఆదేశాల మేరకు తిరిగి రీప్లేస్ చేశామని వివరించారు. సీఎం మాట్లాడుతూ... డిసెంబరు మూడోవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో ఐఎఫ్‌పీ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నాడు-నేడు రెండో దశ పనులను సీఎం సమీక్షించారు. జూనియర్ కాలేజీల్లోనూ చురుగ్గా నాడు-నేడు పనులు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఇంగ్లీషు మాధ్యమాల్లో పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ యూనిట్ పరీక్షల్లో 87శాతం మంది ఇంగ్లీషు మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. టోఫెల్ శిక్షణపై అధికారులు వివరిస్తూ... ప్రతిరోజూ ఒక పిరియడ్ టోఫెల్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఐబీ సిలబస్‌పై తీసుకున్న చర్యలనూ వివరించారు. ఐబీ నుంచి వచ్చే స్పెషలిస్టులు అధ్యయనం చేసి ప్రణాళిక రూపొందిస్తారని, ఐబీ బోధనా పద్ధతులపై వచ్చే విద్యా సంవత్సరంలో టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరో తరగతి, ఆ పైన తరగతులకు ఫ్యూచర్ స్కిల్స్‌పై పాఠ్యాంశాల బోధన ఉంటుందని, పిల్లలకు ఫ్యూచర్ స్కిల్స్‌లో శిక్షణ కోసం ఇంజినీరింగ్ కాలేజీలలో నైపుణ్యం ఉన్నవారి సేవలను ప్రభుత్వం వినియోగించుకోనుందని చెప్పారు. 9, 10వ తరగతి విద్యార్థులు అదనపు ఆప్షన్‌గా జర్మన్, జపనీస్, ఫ్రెంచి, స్పానిష్ లాంటి భాషలను నేర్చుకునే అవకాశంపై దృష్టి పెడుతున్నట్లు అధికారులు చెప్పారు. విద్యాకానుకపైనా సీఎం సమీక్షిస్తూ.. మళ్లీ స్కూళ్లు తెరిచేలోగా విద్యాకానుక పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. పదోతరగతి ఫెయిల్ అయిన వారు సహా 1,49,515 మంది తిరిగి బడుల్లో చేరారని అధికారులు తెలిపారు. పిల్లలను తిరిగి బడులకు పంపే ప్రక్రియలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారన్నారు. దేశంలో నూటికి నూరుశాతం పిల్లలను బడికి పంపడంలో తొలి జిల్లాగా నంద్యాల రికార్డు సృష్టించిందని సీఎంకు వివరించారు.

ఎగ్జాట్ పోల్స్ మాకే అనుకూలం: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోయానని ట్విటర్ వేదికగా కేటీఆర్ వెల్లడించారు. ఇక ఎగ్జిట్‌పోల్స్‌పై కూడా ఆయన స్పందించారు. ఎగ్జిటజ్ పోల్స్ అనేవి పొలిటికల్ హీట్‌ను పెంచవచ్చు కానీ ఎగ్జాట్ పోల్స్ మాత్రం పక్కాగా శుభవార్తను అందజేస్తాయని పేర్కొన్నారు. గురువారం పోలింగ్ ముగియగానే కొన్ని సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్‌పోల్స్‌ను తాము నమ్మడం లేదన్నారు. 70కి పైగా స్థానాల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వస్తామని ఇప్పటికీ చాలా కాన్ఫిడెంట్‌గా చెబుతున్నామన్నారు. రియల్ పోల్ రిజల్ట్ డిసెంబర్ 3న వస్తుందని, కాబట్టి కార్యకర్తలు ఎవరూ కంగారపడవద్దని సూచించారు. డిసెంబర్ 3న వెల్లడయ్యే ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ తప్పని తేలితే... వాటిని విడుదల చేసినవారు ప్రజలకి క్షమాపణ చెబుతారా అని ప్రశ్నించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.